ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య

జిల్లా వార్తలు

5

శనివారం 6 సెప్టెంబరు 2025

డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ బదిలీ

రాయచోటి(నేతాజీసర్కిల్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ విజయవాడకు బదిలీ అయ్యారు. ఈ మేరకు విజయవాడ నుంచి సెర్ప్ సీఈవో కరుణ ఐఏఎస్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన స్థానంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా పీఎంఎల్‌హెచ్ అధికారిగా పనిచేస్తున్న నాగేశ్వరరావుకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. కాగా సత్యనారాయణ గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక రవాణాలో ఇసుక క్వారీలను, సుండుపల్లె మండలంలో సొసైటీ ఏర్పాటు చేసి మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా సరఫరా చేసిన విషయంలో అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి కడప జిల్లా కమలాపురంలో పనిచేస్తున్న సమయంలోనూ మహిళల నుంచి వసూలు చేసిన శ్రీనిధి డబ్బులను బ్యాంకుల్లో జమ చేయకుండా సుమారు రూ.కోటి వరకు కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో ఆయన అధికార పార్టీకి విధేయుడిగా ఉంటూ పార్టీ నాయకులు చెప్పినట్లు ఆడారని సమాచారం. అప్పట్లో ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా వ్యవహరించడంతో టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ షరీఫ్ ఈయనపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు ఈయనను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించండి

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి
- 56 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానం
- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(నేతాజీసర్కిల్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమున్నత లక్ష్యంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి విద్యా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని అజయ్ రెసిడెన్సీ హాలులో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు పండుగ వాతావరణంలో ఘనంగా జరిగాయి. 56మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వరనాయుడు, అటవీశాఖ డైరెక్టర్ రెడ్డెయ్య, ప్రధాన అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించి విద్యా వ్యవస్థను మరింత సమర్థవంతం చేయాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఉన్నతమైన విలువలు, విజ్ఞానం నూరిపోసి భవిష్యత్ తరాలను సమాజానికి దిశానిర్దేశం చేసేలా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటయ్యాక విద్యారంగంలో పెనుమార్పులు తీసుకువచ్చామని, ఇందులో భాగంగానే మెగా డీఎస్సీ నిర్వహించి 16,347 ఉపాధ్యాయ పోస్టులను అత్యంత పారదర్శకంగా భర్తీ చేసినట్లు తెలిపారు. డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకం గతంలో కంటే మిన్నగా పోషకాలతో కూడిన ఆహారం అందిస్తున్నామని చెప్పారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మెనూ ప్రకారం భోజన పదార్థాలను అందిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయుల ను ఇబ్బందులకు గురి చేసిన 117 జీవోను రద్దు చేశామని, ఉపాధ్యాయ సమస్యలను చట్ట పరిమితుల్లో పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అలాగే స్త్రీశక్తి పథకం కింద రాష్ట్రంలోని మహిళలందరికీ ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని మంత్రి తెలిపారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి సమాజానికి ఏ విధంగా ఉపయోగపడుతుందో గుర్తించి ముందుకు నడిపేవారే గురువులు అన్నారు. ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జరుపుకునే ఉపాధ్యాయ దినోత్సవం ప్రతిఒక్కరికీ ప్రేరణ అవుతుందన్నారు. మన జిల్లాలో అత్యుత్తమ సేవలు అందించి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ది మంచిపేరు తెచ్చుకున్న గురువులను సన్మానించుకుంటున్నామన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా గురువుల స్థానం గొప్పదన్నారు. దేశం అభివృద్ధి చెందాలన్నా, ప్రగతిపథంలో నిలవాలన్నా, ఉత్తమ పౌరులుగా తయారు చేసే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. అనంతరం ఉపాధ్యాయులను అతిథులు పేరుపేరునా ఆత్మీయంగా పలకరిస్తూ ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో సుబ్రమణ్యం, డిప్యూటీ డీఈవోలు, మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘం నేతలు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మంత్రి, కలెక్టర్ తదితరులు



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్



మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం

పలువురికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఆర్.సిద్దారెడ్డి



అవార్డు అందుకుంటున్న ఎం.ఉత్తన్న, వి.సరస్వతి, జి.రఘురామయ్య, బి.హరినాథ్

వ్యర్థాల సేకరణకు స్వచ్ఛరథం

6

- ఈ నెల 15 నుంచి పీలేరులో ప్రారంభం
- ప్లాస్టిక్ వస్తువులు, అట్టపెట్టెలు తీసుకొని నిత్యావసరాల పంపిణీ
- ప్లాస్టిక్ రహిత గ్రామాలే లక్ష్యం : డీపీఓ

కస్తూర్బా విద్యార్థినికి పాముకాటు



రాయచోటి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని వైష్ణవి

6

బొప్పాయి రైతుల సమ్మె

- మళ్లీ భగ్గుమన్న ఆందోళనలు
- బొప్పాయి లారీల అడ్డగింత



సిద్దారెడ్డిపల్లె ప్రధానదారిలో సమ్మె చేస్తున్న బొప్పాయి రైతులు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధరల కోసం బొప్పాయి రైతులు శుక్రవారం సమ్మెబాట పట్టారు. బొప్పాయి లారీలను, కార్మికులను వెనక్కి పంపి, లారీల్లో ఉన్న వరిగడ్డి తీసివేసి రోడ్డుపైన కాల్చి నిరసన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధరలు కల్పించే వరకు ఆందోళన కొనసాగిస్తామని తేల్చిచెప్పారు. దీంతో ఆందోళనలు మళ్లీ భగ్గుమన్నాయి.

రైల్వేకోడూరు నియోజకవర్గంలో 20వేల హెక్టార్లలో బొప్పాయి పంటను రైతులు ప్రతి ఏటా సాగుచేస్తున్నారు. రోజుకు 150 నుంచి 200ల లారీల్లో కాయలు ఢిల్లీ తదితర నగరాల మార్కెట్‌కు ఎగుమతి చేస్తున్నారు. అలాంటిది రైల్వేకోడూరులో ఈ ఏడాదిలో ప్రతి రోజుకు 70 లారీల కంటే వెళ్లే పరిస్థితి లేదు. దళారులు, మార్వాడీలు కలిసి ధరలు నిర్ణయిస్తారు. ఈ ఏడాది మొదటిలో టన్ను రూ.16 వేలు ఉన్న ధర రూ.15 వేల నుంచి రూ.10 వేలకు పడిపోయింది. కాగా జూలై ఆఖరులో ఉన్నఫళంగా టన్ను ధర టన్ను రూ.5 వేలు చేయడంతో రైతుల కడుపు మండిపోయి భారీ ఎత్తున ఆందళనకు దిగారు. దళారులపై దాడి చేసే వరకు పరిస్థితి ఏర్పడింది. మార్వాడీలు ధర విషయంలో తగ్గలేదు. గత నెల 1న కలెక్టర్ చామకూరి శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి జోక్యం చేసుకుని మార్వాడీలు, దళారులు, రైతులను పిలిచి సమావేశం ఏర్పాటు చేశారు. టన్నుకు రూ.9 వేలకు తగ్గకుండా కోతలు కోయాలని, ధరలు పెరిగితే ఆ పై ధరలు పెంచి రైతులకు ఇవ్వాలని ఆదేశించారు. ఇందుకు అందరూ అంగీకరించారు. ఇది కొన్ని రోజులు మాత్రమే సాగింది. తర్వాత రూ.5 వేలకు దిగడంతో మద్దతు ధర కోసం రైతులు అనేక రకాల చర్చలు నిర్వహించినా మార్వాడీలు ధరలు పెంచకపోవడంతో ఆందోళనకు దిగారు. పెట్టుబడి ఖర్చు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దక్షిణ భారత దేశంలోనే రైల్వేకోడూరు పండ్ల తోటలకు నెలవుగా ఉంది. అలాంటి రైల్వేకోడూరులోనే రైతులు మోసం పోతున్నారు. చేసిన అప్పులకు తడిసి వడ్డీలు మోపెడు అవుతున్నాయని కన్నీటి పర్యంతమవుతున్నారు.

మంత్రి దృష్టికి బొప్పాయి రైతు సమస్యలు

శుక్రవారం జరిగిన బొప్పాయి రైతుల సమ్మె, జరిగిన పరిణామాలను రాష్ట్ర టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ ఫోన్‌లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ త్యాగరాజుతో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ రైతుల తరుపున చర్చలు జరిపారు. టన్నుకు రూ.12 వేలు చేస్తేనే రైతులకు గిట్టుబాటు అవుతుందని తెలిపారు.



నగిరిపాడులో వరిగడ్డిని కాల్చిన రైతులు

ఎవరికీ భారం కాకూడదని..

వృద్ధ దంపతుల ఆత్మహత్య

- చెన్నూరులో విషాదం



ఆత్మహత్యకు పాల్పడ్డ వెంకటసుబ్బయ్య, నాంచారమ్మ (ఫైల్‌ఫొటో)

చెన్నూరు/సిద్దవటం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఒకరినొకరు వదలలేని ప్రేమానురాగాలు.. ఎక్కడికి వెళ్లినా కలిసి వెళ్లడం. 62 ఏళ్ల అన్యోన్య దాంపత్యం. అలాంటి దంపతులను వృద్ధాప్య సమస్యలు వెంటాడాయి. ఇలాంటి సమస్యలతో నిత్యం బాధపడుతూ బిడ్డలకు భారం కాకూడదని నిశ్చయించుకున్నారు. చివరికి తమ ఊరికి దూరంగా వెళ్లి పెన్నానదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషాద ఘటనకు సంబంధించి వివరాలిలా..

చెన్నూరులోని పడమటివీధిలో నివాసం ఉంటున్న ఆవుల వెంకటసుబ్బయ్య (84), ఆవుల నాంచారమ్మ(82)లకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. అందరికీ వివాహాలయ్యాయి. ముగ్గురూ వేర్వేరు ఊర్లలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. వెంకటసుబ్బయ్య ఆరోగ్యంగా ఉన్నంత వరకు దినసరి కూలీగా వ్యవసాయ పొలాల్లో పనిచేసేవాడు. కొంతకాలంగా ఆ దంపతులకు వృద్ధాప్య సమస్యలు ఎక్కువయ్యాయి. అనారోగ్య సమస్యలు తరచూ వెంటాడుతుండడంతో బిడ్డలను వైద్యానికి డబ్బులు అడగడం, వారిని ఇబ్బంది పెట్టడం ఎందుకనుకున్నారు. జీవితం చాలిస్తే ఎవరికీ భారం ఉండదనుకున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 3వ తేదీ బుధవారం ఉదయం 11గంటలకు ఎవరికీ చెప్పకుండా ఇంట్లోనుంచి ఇద్దరూ వెళ్లిపోయారు. తమ మరణానంతరం అవసరమైన ఖర్చులకు బిడ్డలు ఇబ్బంది పడకూడదని.. బ్యాంకులో పొదుపు చేసుకున్న డబ్బులను, భార్య ముక్కు చెవుల్లోని వస్తువులు తీసి ఇంట్లోనే పెట్టారు. తల్లిదండ్రులు కనిపించకపోవడంతో ఆ కుటుంబ సభ్యులు ఆ రోజంతా వెదికి చివరకు గురువారం చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో కుమారుడు మహేశ్ ఫిర్యాదు చేశారు. వృద్ధ దంపతుల ఆచూకీ కోసం చెన్నూరు సీఐ క్రిష్ణారెడ్డి విచారణ చేపట్టారు.

మాచుపల్లె వద్ద పెన్నానదిలో..

వృద్ధ దంపతులు ఇద్దరూ సిద్దవటం మండలం మాచుపల్లెలోని రేణుక యల్లమాంబ ఆలయం వద్ద గురువారం రాత్రి సుమారు 7గంటల వరకు ఉన్నారు. అమ్మవారిని దర్శించుకుని కాసేపు అక్కడే విశ్రాంతి తీసుకున్నారు. తర్వాత నాంచారమ్మ పెన్నానదిలోకి దిగారు. కాసేపు అటు ఇటు తిరుగుతూ తడబడి చివరకు వెంకటసుబ్బయ్య కూడా పెన్నాలో దిగాడు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో వీరిద్దరూ మునిగిపోయారు. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాలలో ఈ వివరాలు నమోదయ్యాయి. పెన్నా ఒడ్డున నాంచారమ్మ పాదరక్షలు ఉండడంతో బంధువులు గుర్తించారు. వీరి కుమారుడు రాంబాబు ఫిర్యాదు మేరకు సిద్దవటం పోలీసులు శుక్రవారం ఐదుగురు జాలర్ల సహాయంతో పెన్నాలో గాలింపు చర్యలు చేపట్టగా మాచుపల్లి సమీప ప్రాంతాల్లోని ముళ్ల పొదల్లో మృతదేహాలను గుర్తించి ఒడ్డుకు చేర్చారు. సిద్దవటం ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ ఆధ్వర్యంలో శుక్రవారం మాచుపల్లె పెన్నా నది ఒడ్డునే రిమ్స్ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. దీంతో వారి స్వగ్రామమైన చెన్నూరుకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐలు నాయక్, బాబయ్య, హెడ్‌కానిస్టేబుల్ నాయక్, స్థానిక పోలీసు శివప్రసాద్ పాల్గొన్నారు.

ఎంత కష్టమొచ్చిందో వారికి..

ఆరోగ్యం సహకరించకపోయినా ఆ దంపతులు ఇద్దరూ ఆ ప్రాంతంలో అందరితోనూ కలుపుగోలుగా ఉండేవారు. ఎప్పుడూ సంతోషంగా మాట్లాడుతూ గడిపేవారు. అలాంటి వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడడంతో చెన్నూరువాసులంతా ఎంత కష్టమొచ్చిందో ఈ వయసులో వారికి.. ఇలా నదిలో దిగి ఆత్మహత్యకు పాల్పడ్డారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామాల్లో భూతగాదాలు

- 15 గ్రామాలకు 5 మంది సర్వేయర్లు
- రెవెన్యూలో సగం అర్జీలు భూతగాదాలే
- రీసర్వే తప్పిదాలతో రైతులకు అవస్థలు
- తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు



రీసర్వే తప్పిదాలతో రస్తాగా నమోదు చేసిన మామిడి తోట

సుండుపల్లె, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): భూముల విలువలు పెరిగే కొద్దీ గ్రామాల్లో భూతగాదాలు పెరిగిపోతున్నాయి. గ్రామ పంచాయతీకి ఒక సచివాలయం, ఒక సర్వేయర్‌ను నియమించి ప్రజల సమస్యలు పరిష్కరించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అందుకు ప్రభుత్వం గ్రామ పంచాయతీకి ఒక సర్వేయర్ ఉండేలా చర్యలు చేపడుతోంది. కానీ మండలంలో మాత్రం అందుకు భిన్నంగా 15 గ్రామ పంచాయతీలకు 5 మంది సర్వేయర్లు మాత్రమే ఉన్నారు. దీంతో రైతులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్పందనలో ఫిర్యాదు చేసినా భూ సమస్యలు పరిష్కారం కావడం లేదని రైతులు వాపోతున్నారు. సమస్యలు పరిష్కరించకుండానే ఫిర్యాదుదారుల నుంచి సంతకాలు పెట్టించుకుంటున్నారని రెవెన్యూ అధికారులపై విమర్శలున్నాయి. గ్రామాల్లో నెలకొన్న రీసర్వేలు, భూతగాదాలు, దారి సమస్యలు సుండుపల్లె మండలంలో అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. అన్ని సచివాలయాల పరిధిలో సర్వేయర్లు విధుల్లోకి వచ్చి సమస్యల పరిష్కారంపైన దృష్టి సారించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

ఆ సర్వేయర్లే దిక్కు...

15 గ్రామ పంచాయతీలు కలిగిన సుండుపల్లె మండలానికి 5 మంది సర్వేయర్లు ఉండడం, మిగిలిన గ్రామ పంచాయతీల్లో (సచివాలయాల పరిధిలో) ఇన్‌చార్జిలను కూడా నియమించకపోవడం రైతులకు తలనొప్పిగా మారింది. పైగా మండల సర్వేయర్ కూడా వీరబల్లి మండలం నుంచి సుండుపల్లె మండలానికి డిప్యూటేషన్ మీద వచ్చారు. సుండుపల్లెలో ఒక రోజు వీరబల్లిలో ఒక రోజు డిప్యూటేషన్ మీద వచ్చిన మండల సర్వేయర్ విధులు నిర్వహిస్తున్నారు. జి.రెడ్డివారిపల్లె, పొలిమేరపల్లె, తిమ్మసముద్రం, బాగంపల్లి, రాయవరం గ్రామ పంచాయతీలకు మాత్రమే సర్వేయర్లు ఉన్నారు. ముడుంపాడు గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సర్వేయర్ల బదిలీల సందర్భంగా బదిలీ అయిన ముడుంపాడు పంచాయతీ పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడంతో ఆ సర్వేయర్‌ను ప్రస్తుతం బదిలీ చేయలేదు. పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీకి బదిలీపై వచ్చిన సర్వేయర్ ఇక్కడ పనిచేయలేదని, వెళ్లిపోయినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. మిగిలిన 9 గ్రామ పంచాయతీల్లో సర్వేయర్లు లేక భూ సమస్యలు, వ్యక్తిగత భూములను సర్వే చేయడం, సరిహద్దులు గుర్తించడం, తగవులు వస్తే రికార్డులు పరిశీలించడం, కొలవడం వంటి సమస్యలు అధికమయ్యాయని ప్రజలు చెబుతున్నారు. పైగా మండల కేంద్రంలో భూములకు విపరీతమైన డిమాండ్ ఉంది. సుండుపల్లెకు కూడా సర్వేయర్ లేకపోవడం పలు సమస్యలకు దారితీస్తోంది.

రీ సర్వే సమస్యలు తీరేనా...

మండలంలో అక్కంపల్లి, తిమ్మసముద్రం, బాగంపల్లి, పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీలో వైసీపీ ప్రభుత్వంలో రీసర్వే నిర్వహించారు. సర్వే తప్పులు తడకగా నిర్వహించడం వలన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారిలో తిమ్మసముద్రం గ్రామ పంచాయతీకి చెందిన దేవపట్ల రాజమ్మ అతని కుమారుడు చిన్నపరెడ్డిలకు 319-2 సర్వే నెంబర్‌లో 1.20 ఎకరాలు పట్టా భూమి ఉంది. అందులో సుమారు 15 ఏళ్ల నాటి మామిడి చెట్లు ఉన్నాయి. అంతేగాకుండా వరి పంట సాగు చేసి ఉన్నారు. సర్వే సమయంలో ప్రభుత్వం అందించిన మ్యాపులో కూడా పట్టా భూమి మామిడి చెట్లు ఉన్నాయని చూపిస్తోంది. విచిత్రం ఏమిటంటే ఆ పట్టా భూమిని ప్రభుత్వ భూమి రస్తాగా రీసర్వేలో రెవెన్యూ అధికారులు నమోదు చేశారు. తమకున్న పట్టా భూమిని ప్రభుత్వ భూమి రీసర్వేలో అధికారులు నమోదు చేయడంతో ఆ రైతు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. అలాగే పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ బెస్తపల్లికు చెందిన రైతు సుధీర్‌నాయుడు కుటుంబీకులకు సర్వే నెంబర్లు 124, 118, 119, 348, 173-1, 77-3లో పట్టా భూమి సుమారు 10 ఎకరాలు ఉంది. రీసర్వే సమయంలో ఇతరులతో కలిపి ఒకే ఎల్‌పీఎం నెంబరు ఇచ్చారు. ఆన్‌లైన్‌లో ఉందని సర్వేకు వచ్చిన అధికారులకు డాక్యుమెంట్లు చూపించినా ఉన్న భూమిని తగ్గించి ఇతరులతో జాయింట్ చేయడం వలన తనకు చేసుకోలేక రిజిస్ట్రేషన్ కాకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు..



మా కుటుంబ సభ్యుల పేరుతో ఉన్న పట్టా భూమిని ఆన్‌లైన్‌లో తీసేశారు. రీసర్వే చేసి ఇతరులతో కలిపి సర్వే నెంబరు కేటాయించారు. అన్ని రికార్డులు సక్రమంగా ఉన్నాయని అప్పట్లో అధికారులకు చెప్పినా గత ప్రభుత్వంలో పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వినతిపత్రాలు ఇచ్చినా సమస్య పరిష్కరించడం లేదు.

- సుధీర్‌నాయుడు, రైతు, పెద్దినేనికాలువ

చర్యలు లేవు, హద్దులు చూపరు..



సుండుపల్లె నడిఒడ్డున ఉన్న అప్పన్నకుంట ఆక్రమణలకు గురైంది. ఆక్రమణలు తొలగించి హద్దులు ఏర్పాటు చేయండి అని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. కనీసం హద్దులు కూడా ఏర్పాటు చేయడం లేదు. కుంట ఎంత ఆక్రమణకు గురైంది. కుంట విస్తీర్ణం ఎంత ఉంది అని కూడా చెప్పడం లేదు.

- రామజగదీశ్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్

త్వరలో సర్వేయర్ల నియామకం..

బదిలీల్లో భాగంగా ముగ్గురు సర్వేయర్లు రావాల్సి ఉంది. త్వరలో సర్వేయర్ల నియామకం పూర్తవుతుంది. మారుమూల మండలం కావడంతో సర్వేయర్లు మొగ్గుచూపడం లేదు. సర్వేయర్లు బాధ్యతలు చేపట్టగానే గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జిలను నియమిస్తాము.

- భరత్, ఏడీ, అన్నమయ్య జిల్లా

వ్యర్థాల సేకరణకు స్వచ్ఛరథం

- ఈ నెల 15 నుంచి పీలేరులో ప్రారంభం
- ప్లాస్టిక్ వస్తువులు, అట్టపెట్టెలు తీసుకొని నిత్యావసరాల పంపిణీ
- ప్లాస్టిక్ రహిత గ్రామాలే లక్ష్యం
- పంచాయతీలపై అదనపు భారం ఉండదు
- గుంటూరు జిల్లా లాలాపురం పైలెట్ ప్రాజెక్ట్ సక్సెస్
- డీపీఓ రాధమ్మ





పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం, (ఇన్‌సెట్లో) స్వచ్ఛరథంలో ఇవ్వనున్న నిత్యావసర సరుకులు

పీలేరురూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను ప్లాస్టిక్ వ్యర్థాల రహితంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా స్వచ్ఛ రథం పేరుతో ఏర్పాటు చేసిన వాహనాల ద్వారా ప్లాస్టిక్ వస్తువులు సహా ఐరన్, అట్ట పెట్టెలు, ఇతర పనికి రాని వస్తువులు తీసుకొని దానికి బదులుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తోంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ రథాలను గుంటూరు జిల్లా లాలూపురంలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేశారు. ఇక్కడ ఈ పథకం సక్సెస్ కావడంతో అన్నమయ్య జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌గా పీలేరు మేజర్ గ్రామ పంచాయతీలో ఈ నెల 15 నుంచి స్వచ్ఛరథం ప్రారంభించనున్నారు. వీటి ద్వారా వాటర్ బాటిళ్లు, పాలిథీన్ సంచులు, పాడైన ప్లాస్టిక్ వస్తువులు, ఇలా ఇంట్లో పనికిరాని వాటిని బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా స్వచ్ఛ రథం ద్వారా సేకరించనున్నారు. వ్యర్థాలు తీసుకుని ఇచ్చే నిత్యావసరాల్లో పప్పు, ఉప్పు, చింతపండు, సబ్బులు వంటివి ఉన్నాయి.



వ్యర్థాల సేకరణకు ఉపయోగించే స్వచ్ఛరథం

కూటమి ప్రభుత్వం వినూత్న ఆలోచనతో తడి పొడి చెత్తతో పాటు నిరుపయోగమైన ప్లాస్టిక్ తదితర వేస్ట్ సేకరణ కోసం ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) లను రద్దు చేసింది. ఇందుకోసం గతంలో ఉపయోగించిన వాహనాల ఆపరేటర్లకు ఉపాధి కల్పించడంతో పాటు ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను సేకరించేందుకు వాటిని వినియోగిస్తారు. నెలకు ఒక్కో వాహనానికి రూ.21 వేల నుంచి రూ.25 వేలు ఇవ్వనున్నారు. ప్రజల నుంచి సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను బయటి మార్కెట్లో విక్రయించి వాటికి సరిపడా నిత్యావసర సరుకులు తెచ్చుకునే బాధ్యత ఎండీయూ ఆపరేటర్లకు అప్పగించారు.

చెత్త తీసుకొని ఇచ్చేవి...

'స్వచ్ఛ రథం' వద్ద పాత ఇనుము, పేపర్లు, పుస్తకాలు, అట్టపెట్టెలు, ప్లాస్టిక్, గాజుసీసాలు, స్టీల్, అల్యూమినియం తదితర పాడైన వస్తువులు తీసుకొంటారు. వీటికి విలువ కట్టి నిత్యావసరాలైన కొబ్బరి నూనె, సర్ఫ్ ప్యాకెట్లు, ఉల్లిపాయలు, బట్టల సబ్బులు, ఒంటి సబ్బులు, టీ, కాఫీ, పౌడర్లు, లేస్ పాకెట్లు, పేస్ట్, షాంపూ ప్యాకెట్లు, ఉల్లిపాయలు, టూత్ బ్రష్‌లు, పెన్నులు, పెన్సిల్లు, గోధుమ పిండి, వేరుశనగ గుళ్లు, మినపగుళ్లు, కందిపప్పు తదితర నిత్యావసరాలు ఇస్తారు. కేజీ ప్లాస్టిక్‌కు రూ.20 చొప్పున నిత్యావసర సరుకులు ఇస్తారు.

పంచాయతీపై ఆర్థిక భారం ఉండదు

- రాధమ్మ, డీపీఓ



స్వచ్ఛ రథం పథకాన్ని పీలేరులో ఆగస్టులో ప్రారంభించాలని అనుకున్నాం. అయితే కొంత ఆలస్యమైంది. ఈ నెల 15 నుంచి పీలేరులో స్వచ్ఛరథం ప్రారంభిస్తాం. దీనివల్ల పంచాయతీపై ఎటువంటి అదనపు భారం పడదు. కేవలం వాహనం మెయింటనెన్స్, ఆపరేటర్‌కు నెల జీతం రూ.21 వేలు ఇవ్వడం జరుగుతుంది. గుంటూరు జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతమైంది. అన్నమయ్యలో పీలేరు మేజర్ పంచాయతీని ఎంపిక చేశాం. అనంతరం దశలు వారిగా ఇతర మండలాలకు విస్తరింపజేస్తాం. ఇళ్లలో నిరుపయోగమైన వ్యర్థాలను ఇచ్చి నిత్యావసర సరుకులు తీసుకోవడం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగం.

పూర్వ విద్యార్థుల చేయూత

- రూ.2.50 లక్షలతో కళావేదిక నిర్మాణం, రాధాకృష్ణన్ విగ్రహం వితరణ



రాధాకృష్ణన్ విగ్రహం వద్ద పూర్వ విద్యార్థులు

ములకలచెరువు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బురకాయలకోట జడ్పీ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థులు చేయూతనిచ్చారు. పాఠశాలలో 1986-87లో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు రూ.2.50 లక్షలతో కళావేదిక (స్టేజీ) నిర్మించడంతో పాటు డాక్టర్ సర్వేపల్లె రాధాకృష్ణన్ విగ్రహాన్ని వితరణ చేశారు. గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం పూర్వ విద్యార్థులు నిర్మించిన కళావేదికలో సర్వేపల్లె రాధాకృష్ణన్ విగ్రహం ఏర్పాటు చేశారు. ఇక్కడే గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే తమకు చదువు చెప్పిన గురువు రామకృష్ణమరాజుతో పాటు ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న టీచర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో పూర్వ విద్యార్థులు గుత్తికొండ త్యాగరాజు, సీవీ రెడ్డి, మంగరాజు, బాబు, లక్ష్మన్న, మద్దిరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, వీవీ రమణ, మిలటరీ నరసింహులు, రామచంద్ర, సంధ్యారాణి, సునంద, రెడ్డెమ్మ, ప్రమీల, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

కారుకు నిప్పు - కేసు నమోదు



కాలిపోయిన మారుతీకారు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంటి సమీపంలో నిలిపి ఉంచిన తన మారుతీకారుకు శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు స్థానిక పాత మసీదు ప్రాంతానికి చెందిన అన్వర్‌బాషా తెలిపారు. కొన్నేళ్లుగా తన ఇంటి సమీపం లోని చెట్టు కింద కారు పెడుతున్నామని, శుక్రవారం తెల్లవారు జామున కారు టైరు పగిలిన శబ్దం రావడంతో బయటకు వచ్చి చూసేసరికి కారు మంటల్లో కాలుతూ కనిపించిందన్నారు. పోలీసు లకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ రవీంద్రబాబు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు బాధితుడు అన్వర్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న బొలెరో

- రైతుకు తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడ్డ శివారెడ్డి

ములకలచెరువు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముంబై-చెన్నై జాతీయ రహదారిలోని వేపూరికోట పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం బొలెరో వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజుగారిపల్లెకు చెందిన రైతు శివారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని దేవళచెరువు పంచాయతీ రాజుగారిపల్లెకు చెందిన రైతు శివారెడ్డి(45) పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో వేపూరికోటకు వచ్చాడు. ఈ క్రమంలో పెట్రోల్ బంకులో పెట్రోల్ పట్టుకునేందుకు వెళ్తుండగా బొలెరో వాహనం ఢీకొంది. దీంతో రైతు తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వినాయక నిమజ్జనం అడ్డగింత



విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న దళితులు

నందలూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్తపి గ్రామంలో దళితులు నిర్వహిస్తున్న వినాయకుడి నిమజ్జనాన్ని అగ్రవర్ణాలవారు అడ్డుకున్నారు. దళితుల కథనం మేరకు.. గురువారం రాత్రి పొత్తపి హరిజనవాడకు చెందిన దళితులు వినాయకుడిని నిమజ్జనం చేసేందుకు ఊరేగింపుగా వెళుతుండగా, అగ్రవర్ణాల వారు రాళ్లు, కట్టెలతో దాడికి ప్రయత్నించగా, అక్కడి నుంచి పారిపోయి పోలీసులను ఆశ్రయించారు. తమపై దాడికి యత్నించిన ఐదుగురిపై చర్యలు తీసుకోవాలని దళితులు కోరారు.

జూదరుల అరెస్ట్

రాజంపేటటౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని భవానినగర్ సమీపంలో పేకాట ఆడుతున్న 11 మందిని శుక్రవారం అదుపులోకి తీసుకొని, రూ.15 వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగార్జున తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవానినగర్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది దాడి చేశారని తెలిపారు.

రేపు జమ్మలమడుగులో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జూనియర్ జట్లు ఎంపిక

రాజంపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7న ఆదివారం జమ్మలమడుగు మండలం ఎస్.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి కడప జిల్లా జూనియర్ బాల బాలికల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.కృష్ణమూర్తి, జి.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎంపికలకు ఫిబ్రవరి 1, 2006 తర్వాత జన్మించినవారు అర్హులని తెలియజేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 12, 13, 14 తేదీల్లో అనంతపురం జిల్లా బత్తలపల్లి మండలం రామాపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. క్రీడాకారులు సెలక్షన్‌కు వచ్చేటప్పుడు పుట్టిన తేదీ గల ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్స్, పదో తరగతి మార్కుల జాబితా, 8 ఫొటోలు, డ్రెస్‌కోడ్, షూ, తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. వివరాలకు 9490181104, 7036907303 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేవారికి గ్రామ పెద్ద శ్రీనివాసులరెడ్డి ఉచిత భోజనం ఏర్పాటు చేయనున్నారని వివరించారు.

ముగిసిన వెంకన్న పవిత్రోత్సవాలు

- వైభవంగా పూర్ణాహుతి

తంబళ్లపల్లె, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో గత నాలుగు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతున్న వార్షిక పవిత్రోత్సవాలు మహాపూర్ణాహుతితో వైభవంగా ముగిశాయి. శుక్రవారం తెల్లవారుజామున వేదపండితులు శ్రీవారిని సుప్రభాతంతో మేల్కొలిపి దూపదీప నైవేద్యాలతో సహస్రనామార్చన, నిత్యకైంకర్యాలు పూర్తి చేశారు. యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చతుస్థానార్చన, మహా పూర్ణాహుతి, కుంభప్రోక్షణ, పవిత్ర విసర్జన పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనే, చందనం, నెయ్యి, పసుపు, కొబ్బరినీళ్లతో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకిపై కొలువుదీర్చి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు వరలక్ష్మీ, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్ భట్టర్, ఉప ప్రధాన అర్చకులు రమేష్ స్వామి, సిబ్బంది నగేష్ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారిని ఊరేగింపుగా తీసుకువెళ్తున్న టీటీడీ అధికారులు, వేదపండితులు

పెట్రోల్ పోసి నిప్పుపెట్టిన కేసులో..

ఆరుగురు నిందితులు అరెస్టు

- రిమాండ్‌కు తరలింపు



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ పోసి నిప్పు పెట్టిన కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. ఈ నెల 3వ తేదీన మదనపల్లె పట్టణం, బీకేపల్లెలోని వైఎస్సార్ కాలనీలో ఓ వ్యక్తిపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టిన కేసులో ఆరుగురిని గుర్తుంచి అరెస్టు చేసినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టూటౌన్ పోలీసుస్టేషన్‌లో మిడియాతో డీఎస్పీ మాట్లాడుతూ అన్నదమ్ముల ఆస్తి వివాదాల నేపథ్యంలో సలీంబాషా ఇంటిపై రాయచోటి వాసులు దాడి యత్నాన్ని అడుకున్న రమేష్ నాయక్‌పై పెట్రోల్ పోసి నిప్పు అంటించి చంపడానికి ప్రయత్నించిన కేసులో నిందితులు రాయచోటికి చెందిన ఖాసీం సాహెబ్ కుమారులు షేక్ జావీద్ హుసేన్, షేక్ సామీర్ హుసేన్, జీలాని బాషా కుమారుడు షేక్ ఇలాహి అలియాజ్ ఫాజిల్, కలికిరి మండలం వాసి అబ్దుల్ మజీద్ కుమారుడు వేంపల్లె మస్తాన్, కేవిపల్లె మండలం, తిమ్మాపురం గ్రామం, కొత్తఇండ్లుకు చెందిన ఇమాంసాహెబ్ కుమారుడు షేక్ అమీర్ సాహెబ్, కలి కిరి మండలం, గుండ్లూరుకు చెందిన సుధాకర్ కుమారుడు విశ్వనాథ్‌బాబు ఉన్నారన్నారు. వైఎస్సార్ కాలనీలో ఉన్న షేక్ సలీంబాష తండ్రి షేక్ మహబూబ్ బాషా, అతని అన్న రాయచోటికి చెందిన ఖాషీం సాహెబ్ ఆస్తి విషయమై మనస్పర్థలు ఉండేవని, ఏడాది కిందట షేక్ మహబూబ్‌బాషా మృతి చెందాడని, ఇరు కుటుంబాల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఆగస్టు 15వ తేదీన కూడా మదనపల్లెకు వచ్చి ఘర్షణ పడ్డారని చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 3వతేదీ ఫోన్‌లో గొడపడ్డారని వెంటనే పథకం ప్రకారం రాయచోటి నుంచి కారులో వచ్చి మార్గమధ్యలో బాటిల్‌లో పెట్రోలు తీసుకొచ్చా రని వివరించారు. 3 వతేదీ తెల్లవారుజామున 4 గంటలకు బీకేపల్లె చేరుకుని సలీంబాషా నివాసం ఉన్న పైగది వెళ్ల డానికి అక్కడ గేట్‌ను, షట్టర్‌ను పగలకొట్టడానికి ప్రయత్నం చేస్తుండగా శబ్దం రావడంతో సలీం బాషా ఇంట్లో బాడుగకు ఉంటున్న రమేష్‌నాయక్ చూసి అడ్డుకోవడంతో అతనిపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టారు. గమనించిన మరో వ్యక్తి బైక్‌పై రావడంతో ఆ బైక్‌ను కూడా ధ్వంసం చేశారని చెప్పారు. ఈ మేరకు వారిపై హత్యాయత్నం, ఎస్సీఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ప్రస్తుతం గాయపడిన రమేశ్‌నాయక్ బెంగళూరులో చికిత్స పొందుతున్నాడు. రాబడిన సమాచారం మేరకు వారిని మదనపల్లె పట్టణం, రామారావు కాలనీ, ఆటోస్టాండ్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో అరెస్టు చేసినట్లు చెప్పారు.

మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న గౌతమ్‌కుమార్

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు తీసుకున్న పీపీపీ మోడల్‌ను వెంటనే విరమించుకోవాలని, మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ - పబ్లిక్ - పార్టనర్‌షిప్ విధానంతో రోడ్లు, వైద్యం, యుటిలిటీ వంటి ప్రజా సేవలు ప్రైవేట్ పరం చేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులు మెడికల్ కళాశాలల్లో రిజర్వేషన్ కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు మదనపల్లె ప్రజలు రాజకీయ భిక్ష పెడితే ఆ ప్రజల నోట్లో మట్టి కొడుతున్నారన్నారు. ప్రతిపక్షంలో అనేక ఉద్యమాల్లో పాల్గొన్న విషయాలను ఎమ్మెల్యే షాజహాన్ బాషా గుర్తుపెట్టుకోవాలన్నారు. మదనపల్లె మెడికల్ కళాశాల ప్రైవేట్ పరం చేయాలని చూస్తే ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తన పదవికి రాజీనామా చేసి చిత్త శుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. నిన్నటి కేబినెట్‌లో అన్ని మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలని ఆమోదించడం దారుణమన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు బీఎస్పీ పిలుపునిస్తోందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నేతలు సహదేవ, చంద్ర, బాలజీ, మహేష్, ప్రశాంత్, శివ, అనిల్,రెడ్డెప్ప, వేణు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వైద్యం దూరమైనట్లే

మదనపల్లె మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట సీపీఎం నిరసన చేపట్టింది. జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ పీపీపీ పద్ధతి రద్దు చేయాలని, ప్రభుత్వ ఆస్పత్రిని ప్రైవేటీకరణ చేయెద్దు అంటూ పెద్దఎత్తున నినాదాలు చేపట్టారు. మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం కోలార్ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి వైద్య సేవలను పొందుతున్నారన్నారు. మెడికల్ కళాశాల అభివృద్ధి అయితే అన్ని రకాల వైద్య సేవలు ఇక్కడే పొందవచ్చన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాది సోముశేఖర్, సీపీఎం నేతలు ప్రభాకర్ రెడ్డి, నరసింహ, నాగరాజ, ఆఫ్రీద్, జయబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల భూ దందాపై సీఎంకు వినతి



సీఎంను కలిసి వివరిస్తున్న పుల్లంపేట టీడీపీ నాయకులు

పుల్లంపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు ఆక్రమించారని, దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో రైల్వేకోడూరు మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ నేలపాటి రామచంద్ర నాయుడు, మండల మాజీ ఇన్‌చార్జి పోలూరు కృష్ణమనాయుడు, మండల యూత్ నాయకులు ముద్దా సుభాష్‌రెడ్డి శుక్రవారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసి ఫిర్యాదు చేశారు. మండలంలోని అనంతసముద్రం, వత్తలూరు, తిప్పాయపల్లె ప్రాంతాల్లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూముల కబ్జా చేయడంతోపాటు, కొందరి నుంచి బలవంతంగా లాక్కొని అమ్మివేశారని సర్వేనంబర్లతో సహా ముఖ్యమంత్రికి వివరించారు. మండలానికి పెద్దఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని విన్నవించుకున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి సీఎంకు వివరించారు.

యునాని వైద్య కళాశాలకు స్థలం కేటాయింపుపై హర్షం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో యునాని వైద్య కళాశాల కోసం రాష్ట్ర ప్రభుత్వం 10 ఎకరాలు స్థలం కేటాయించడంపై అన్నమయ్య జిల్లా రియాసతి ఉర్దూ ఉపాధ్యాయ సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా జరిగిన నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం అధ్యక్షుడు సిబాతుర్ రెహమాన్ మాట్లాడుతూ ఉర్దూ విద్యార్థులు ఎక్కువగా ఉన్న రాయచోటి ప్రాంతంలో యునాని వైద్య కళాశాల ఏర్పాటుతో చాలా మంది వైద్య విద్యను అభ్యసించడానికి అవకాశం ఉంటుందన్నారు. సంఘం రాష్ట్ర కోశాధికారి అసదుల్లాషా మాట్లాడుతూ గత శతాబ్దకాలంగా రాయచోటిలోని డైట్ కళాశాల వేల మంది ఉర్దూ ఉపాధ్యాయులను అందించిందని, యునాని కళాశాల వస్తే ఎంతో మంది యునాని వైద్యులు సిద్ధమవుతారన్నారు. అనంతరం ఉపాధ్యాయులు మహమ్మద్‌అలీ, ఇలియాస్ మాట్లాడుతూ ఈ కళాశాల మంజూరుకు సహకరించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. రూటా రాష్ట్ర సభ్యులు మహమ్మద్ అలీ, ఇలియాస్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ జాఫరుద్దీన్, కోశాధికారి ముహిబుల్లా తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యార్థినికి పాముకాటు



రాయచోటి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని వైష్ణవి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని సుండుపల్లె రోడ్డులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల పదో తరగతి విద్యార్థిని పాము కాటుకు గురైంది. మండల పరిధిలోని శిబ్యాల గ్రామ హరిజనవాడకు చెందిన వైష్ణవి శుక్రవారం ఉదయం పాఠశాల ఆవరణలో చదువుకుంటూ ఉండగా కుడికాలి బొటనవేలిపై పాము కాటు వేయడంతో, పాఠశాల సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ విద్యార్థిని రాయచోటి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యులు అంటున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు ఆసుపత్రికి చేరుకుని సంఘటనపై ఆరా తీశారు. ఇదిలా ఉండగా పాఠశాల చుట్టూ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు ఏపుగా ఉండడంతోనే విషపురుగులు పాఠశాలలో సంచరిస్తున్నాయని, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆలిండియా స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుమ్మల లవకుమార్ డిమాండ్ చేశారు.

కడప జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..



కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్సీలు రాంగోపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, ఎస్పీ అశోక్‌కుమార్, డీఈవో షంషుద్దీన్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న ప్రధానోపాధ్యాయురాలు పి.నాగమణి



జె.మెర్సీమాలిని, కేవీ నాగిరెడ్డి, ఎన్.సరస్వతి, ఎం.రామకృష్ణమ్మ, కె.లక్ష్మీకేశమ్మ, శ్రీ దీపారెడ్డి, వి. జనార్దన్, డి. నాగరాజు, కె. నాగార్జున, టి. సావిత్రమ్మ, పీవీ పద్మనాభరెడ్డి



పి. నాగకృష్ణారెడ్డి, ఎస్. నూర్, పి.భార్గవిప్రియదర్శిణి, బి. సుధాకర్‌రెడ్డి, పి.మహాలక్ష్మి, పి. శ్రీదీప, ఎ. ఎరుకలరెడ్డి, వీవీ గాయత్రి, ఎస్ఆర్‌వీ ప్రసాద్‌రెడ్డి, ఎస్.ఫిరోజ్‌జాన్, ఎస్.గురవయ్య, పీఆర్ మంజులాదేవి, ఎస్.ఓబయ్య



ఎ.అరుణకుమారి, కె.రవిశంకర్, బీవీ సుబ్బారెడ్డి, ఎస్.సయ్యద్‌బాష, ఎస్‌వి చాంద్‌బాష, ఎస్తేర్ సుకుమారి, టి. రామకృష్ణ, జె.సుబ్రమణ్యం, జి.గోపీనాథ్, ఎం.శివప్రసాద్, సుచిత్రకుమారి, కె.కృష్ణయ్య, జి.శివరామకృష్ణమరాజు



బి.శ్రీనివాసులు, ఎస్.ఖాసింవల్లీ, పి.సుహాసిని, బి.భాస్కర్‌రెడ్డి, ఎస్.రామకృష్ణారెడ్డి, బి.ఆదిశేషారెడ్డి, కె.వెంకటసుబ్బన్న, డి.దస్తగిరి, ఎన్.రాజారావ్, సి.వీరారెడ్డి, ఆర్.గురవయ్య, ఆర్‌వీ సౌభాగ్యలక్ష్మీదేవి, కె.రాధిక



మేరీ సువర్ణ, ఎన్.శ్రీనివాసులు, ఎ.పెంచలయ్య, బి.ప్రభుభూషణ, పి.గాయత్రి, బి.ఈశ్వర్‌రావు, సి.సుదర్శన్, టి.శ్రీనివాసులు, ఐ.రహీంబకాష్, ఎస్.ఫాతిమాసుల్తానా, ఎస్.హబీదున్నీసా బేగం, ఏ.ఫరీదాభాను, వెంకటసుబ్బయ్య

అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తన భర్త, అత్తమామలు, మరిది అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని వి.సునీత అనే మహిళ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ ఆర్‌వీ కొండారెడ్డి తెలిపారు. మండలంలోని కొరపాటిపల్లె పంచాయతీ ఇందిరానగర్‌కు చెందిన వీధిపోగు సునీతకు 2020 సంవత్సరం మైదుకూరు మండలం విశ్వనాధపురానికి చెందిన సిరివెళ్ల పవన్‌కళ్యాణ్‌తో వివాహం జరిగింది. వివాహం తరువాత పిల్లలు పుట్టలేదని, కట్నం తీసుకురమ్మని తనను మానసికంగా శారీరకంగా ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బ్రాందీషాపులో చోరీ

● మద్యం బాటిళ్లు, నగదు అపహరణ

ఖాజీపేట సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని కోటంగురాయునిపల్లె వద్ద గల ఎస్ఎల్‌బీ వైన్స్‌లో శుక్రవారం తెల్లవారు జామున చోరీ జరిగింది. యజమాని నెల్లూరప్ప యాదవ్ వివరాల మేరకు... రోజు దినచర్యలో భాగంగా రాత్రి 10 గంటలకు అన్ని డోర్లు లాక్ చేసి వెళ్లామని, శుక్రవారం ఉదయం అంగడి తెరువగా లోపల వెనుక భాగంలో గల డోరు తెరచి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. క్యాష్ కౌంటర్‌లోగల రూ.10వేలు నగదు, అయిదు కేసుల మందు తీసుకెళ్లినట్లు సీసీ పుటేజీలో ఉందన్నారు. ఈ మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



చోరీకి పాల్పడుతున్న వ్యక్తి ఫొటో సీసీ పుటేజీలో రికార్డయిన దృశ్యం

అదుపు తప్పి కాలువలో పడి మహిళ మృతి

మైదుకూరు రూరల్,సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిప్పిరెడ్డిపల్లె సమీపంలోని తెలుగుగంగ కాలువలో జారిపడి గుండంరాజు లక్ష్మమ్మ (75) అనే మహిళ మృతి చెందారు. సీఐ రమణారెడ్డి వివరాల మేరకు... మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని బండివారిపల్లె గ్రామానికి చెందిన లక్ష్మమ్మ పొలం పనులకు వెళ్లింది. ఆ సమయంలో బహిర్భూమికి వెళ్లి కాలుజారి కాలువలో పడి మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీరాములు

కమలాపురం రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గంగవరం గ్రామ సమీపంలోని కాశినాయన దేవాలయం వద్ద ఓ వ్యక్తిని సిమెంటు ట్యాంకర్ ఢీకొన డంతో తీవ్ర గాయాల య్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. మైదుకూరు మండలం బదిరేపల్లె గ్రామానికి చెందిన కామనూరు శ్రీరాములు అనే వ్యక్తి గంగవరం గ్రామ సమీపంలో కాశినాయన ఆలయం సమీపంలో అరు గుపై కూర్చుని బంధువులతో మాట్లాడుతున్నాడు. అదే సమయంలో ఖాజీపేట నుంచి కమలాపురం వైపు వస్తున్న సిమెంటు లారీ ప్రమాద వశాత్తు ఢీకొట్టింది. దీంతో శ్రీరాములుకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తరలించి చికిత్స అందించారు. డ్రైవరు మద్యం మత్తులో ఉండడమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.

160 పరుగులతో నెల్లూరు జట్టు ఘన విజయం

● డ్రాగా ముగిసిన కడప- కర్నూలు మ్యాచ్

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ మల్టీడే (మూడురోజుల) క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా చివరి రోజైన శుక్రవారం వివిధ జట్ల మధ్య పోటీలు రసవత్తరంగా సాగాయి. ఇందులో అనంతపురం జట్టుపై నెల్లూరు జట్టు 160 పరుగులతో విజయం సాధించింది. కడప- కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్ డ్రాగా ముగిసింది. వివరాలిలా...

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో 44.4 ఓవర్లలో 239 పరుగులు చేసింది. అనంతపురం జట్టు 43.3 ఓవర్లలో 242 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో అనంతపురం జట్టుకు 3 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. రెండవ ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు 60 ఓవర్లలో 350 పరుగులకు ఆలౌట్ అయింది. 347 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు చివరి రోజు 48.1 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో నెల్లూరు జట్టు 160 పరుగుల తేడాతో గెలుపొందింది.

నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 88.4 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 374 పరుగులకు డిక్లేర్ చేసింది. తదనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 67.3 ఓవర్లలో 314 పరుగులు చేసింది. దీంతో కడప జట్టుకు 60 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది.

ఆటకు చివరి రోజైన కడప జట్టు రెండో ఇన్నింగ్స్‌కు దిగి 80 ఓవర్లలో 297 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. ఇందులో శివకేశవ 66 పరుగులు, ఆదిల్‌హుస్సేన్ 58 పరుగులు చేశారు. అనంతరం కర్నూలు జట్టు తన రెండో ఇన్నింగ్స్‌కు దిగి ఆట ముగిసే సమయానికి 3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 40 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

గణనాథునికి ఘనంగా కుంకుమార్చన



దేవరగుట్టపల్లెలో గణనాథునికి మహిళలచే కుంకుమార్చన

చక్రాయపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెర్సు పల్లె గ్రామం దేవరగుట్టపల్లెలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి 500 మంది మహిళలతో కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచు సుబ్బరామయ్య కుమారుడు రాహుల్ ఆధ్వ ర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కుంకుమార్చనలో పాల్గొన్న మహి ళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఇసుక ట్రాక్టరు బోల్తా... డ్రైవరుకు గాయాలు

వల్లూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జంగంపల్లె గ్రామ సమీపాన ఇసుక లోడుతో వెళుతున్న ట్రాక్టరు బోల్తా పడటంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. కడపకు ఇసుక తరలిస్తున్న ట్రాక్టరు అదుపు తప్పి పైడికాల్వ క్రాస్ వద్ద రోడ్డుపై బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టరు డ్రైవరుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి 108 వాహనంకు సమాచారం అందించారు. గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



సంఘటనా స్థలం వద్ద బోల్తాపడిన ట్రాక్టరు

రేపు ఆలయాల మూసివేత

కడప కల్చరల్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్ర గ్రహణం సందర్భంగా ఈనెల 7వ తేదీ ఆదివారం జిల్లాలోని ఆలయాలను మధ్యాహ్నం 3-30 గంటల నుంచి మూసివేయనున్నట్లు జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ జి. మల్లికార్జున ప్రసాద్ తెలిపారు. తిరిగి 8వ తేదీ సోమవారం ఉదయం ఆలయాల శుద్ధి, సంప్రోక్షణ చేసి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. భక్తులు ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించాలని కోరారు.

ఆలోచన అదిరిందయ్యా.. శీనయ్య!

ఓ రైతు తాను సాగు చేసిన పంటను కాపాడేందుకు వినూత్నంగా ఆలోచించాడు. పాత దువ్వూరుకు శ్రీనివాసులునాయుడు గ్రామ సమీపంలో పసుపు పంట సాగు చేశాడు. పసుపుతోటకు పక్కనే చింతచెట్లు ఉన్నాయి. వాటిపై ఉన్న కోతులు నిత్యం తోటలోకి వచ్చి మొక్కలు పీకివేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతు శ్రీనివాసులు నాయుడు కోతులతో విసుగుచెందాడు. పంటను కాపాడుకునేందుకు సమీప పొలంలో స్పీకర్ పొట్టాడు. బౌబౌ అంటూ ఒక శబ్దంతో కూడిన స్పీకర్‌ను అమర్చాడు. కుక్క వచ్చి అరచినట్లు, రాళ్లు గలకరించిన శబ్దంతో స్పీకర్ పనిచేయడంతో కోతులు ఆ సమీపంలోకి వచ్చేందుకు భయపడుతున్నాయి. దీంతో రైతు ప్రయత్నం ఫలించింది. ఇది చూసిన తోటి రైతులు అదిరిందయ్యా శీనయ్య అంటూ మెచ్చుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి - దువ్వూరు)



కోతుల బెడద నివారించేందుకు ఏర్పాటు చేసిన లౌడ్‌స్పీకర్



పొలంలో కోతులు పీకివేసిన పసుపు మొక్కలు

మతిస్థిమితం లేని మహిళ.. భర్తకు అప్పగింత

కలసపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేక గ్రామాలలో సంచరిస్తున్న రమాదేవి అనే మహిళను గురువారం రాత్రి మండల పరిధి లోని తెల్లపాడు గ్రామంలో గుర్తించారు. మహిళపై అనుమానంతో గ్రామస్థులు 112కు ఫిర్యాదు చేశారు. రాత్రి గస్తీకాస్తున్న పోలీసులు అక్కడకు చేరుకొని ఆ మహిళతో మాట్లాడి భర్తకు అప్పజెప్పారు. ఆమె చాపాడుకు చెందిన మహిళ అని పోలీసులు తెలిపారు. సకాలంలో స్పందించిన హెడ్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్, కానిస్టేబుల్ అజాముద్దీన్, హోంగార్డు సుధాకర్‌లను తెల్లపాడు గ్రామస్థులు అభినందించారు.



మహిళను భర్తకు అప్పజెబుతున్న పోలీసులు



పంచాయతీ ఎన్నికలపై దృష్టి పెట్టండి

● ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, విప్ అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): విభేదాలు పక్కన పెట్టి వచ్చే పంచాయతీ ఎన్నికలపై దృష్టి సారించాలని జనసేన పార్టీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ మరో మూడు నెలల్లో రానున్న పంచాయతీ ఎన్నికల్లో రైల్వేకోడూరు నియోజకవర్గంలో 40 పంచాయతీల్లో జనసేన అభ్యర్థులు విజయం సాధించే విధంగా కార్యకర్తలు, నాయకులు, అభిమానులు కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. ఎవరైనా పార్టీకి నష్టం కల్గించే విధంగా నడుచుకుంటే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ చేపట్టే చర్యలకు బాధ్యులు అవుతారని హెచ్చరించారు. పార్టీలో నాయకుల మధ్య విబేదాలు సహజంగా ఉంటాయని వాటిని పక్కనబెట్టి సమష్టిగా కృషి చేయాలని తెలిపారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ రైల్వేకోడూరు పవన్‌కు ఎంతో ఇష్టమైన నియోజకవర్గం అని తెలిపారు. కనుక జనసైనికులు అందరూ పంచాయతీ ఎన్నికల్లో కష్టపడాలని తెలిపారు. కష్టపడిన ప్రతి ఒక్కరికి పార్టీలో సుముచిత స్థానం ఉంటుందన్నారు. సీనియర్ నాయకుడు నార్జాల దాశరథి మాట్లాడుతూ కొందరు కావాలనే జనసేన పార్టీకి చెడ్డ పేరు తీసుకుని వస్తున్నారని, అలాంటివారు తమ కార్యక్రమాలకు స్వస్తి పలకాలన్నారు. లేదంటే పార్టీ నష్ట పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పగడాల వరలక్ష్మి, మైసూరి వారి పల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్త, నాయకులు ఆలం రమేష్, ఉత్తరాది శివకుమార్, ముత్యాల కిషోర్, సాధు కిషోర్, సవరం సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కమ్మరి కార్పొరేషన్ డైరెక్టర్


మంత్రి మండిపల్లిని సన్మానిస్తున్న కమ్మరి కార్పొరేషన్ డైరెక్టర్ గుడి స్వర్ణ

రాయచోటి టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అజయ్ కల్యాణ మండపంలో శుక్రవారం రాష్ట్ర కమ్మరి కార్పొరేషన్ డైరెక్టర్ గుడి స్వర్ణ ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి తన ఎంపికకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆమెకు శుభాకాంక్షలు తెలిసి శాలువాలతో ఘనం గా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండా భాస్కర్‌రెడ్డి, పలువురు గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుడి నిమజ్జనం


నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథుడు

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం బ్యాండు వాయిద్యాలు, సాంస్కృతిక నృత్యాల నడుమ నిమజ్జనం నిర్వహించారు. రాయచోటి ఎస్ఎన్ కాలనీ స్టేట్ బ్యాంక్, జగదాంబ సెంబర్ రామాలయం, మదనపల్లె రోడ్డు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను ప్రజలు నిమజ్జనానికి తర లించారు. యువత డీజే బండ్ల ముందు కేరింతలు కొట్టారు.



ఆదర్శప్రాయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్


ఆటో అందజేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి రాధాకృష్ణన్ అడుగు జాడల్లో ఉపాధ్యాయులు నడిచి విద్యార్థులను సమాజ నిర్మాతలుగా తీర్చిదిద్దాలని టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్ మోహన్‌రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం గురుపూజోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి రాజంపేట టీడీపీ కార్యాలయంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువులకే దక్కిందన్నారు.సమాజంలో గురువు పాత్ర చాలా ప్రాముఖ్యత కలిగిందని అలాంటి గురువులకు ఆదర్శప్రాయమైన వ్యక్తి సర్వేపల్లి రాధాకృష్ణన్ అని కొనియాడారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాజంపేట పర్యటన సందర్భంగా తనకు ఓ ఆటో ఇప్పించాలని కోరడంతో టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు శుక్రవారం ఆయనకు ఆటోను అందజేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆటో అందజేయడం ఆనందంగా ఉందని ఆయన తెలియజేశారు.

కానాల సౌభాగ్యమ్మకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు


కానాల సౌభాగ్యమ్మను సన్మానిస్తున్న కలెక్టర్, మంత్రి

గాలివీడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నూలివీడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయు రాలుగా విధులు నిర్వహిస్తున్న కానాల సౌభాగ్యమ్మ శుక్రవారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడావాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామూరి శ్రీధర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు అందుకున్నారు. గురుపూజోత్సవం సందర్భంగా రాయచోటి పట్టణం లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఆ మె మాట్లాడుతూ తాను చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించి సత్కరించిందని సంతోషం వ్యక్తం చేశారు.





సర్పంచుల అవినీతిపై చర్చకు సిద్ధమా?

● వైసీపీ నేత ఇరగంరెడ్డికి టీడీపీ నాయకుల సవాల్

ఒంటిమిట్ట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్పంచుల అవినీతి అక్రమాలపై చర్చకు సిద్ధమా అని జడ్పీటీసీ సభ్యుడుముద్దు కృష్ణారెడ్డి.. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డికి సవాల్ విసిరారు. శుక్రవారం సాయంత్రం స్థానిక హరితా హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని సర్పంచులు అవినీతికి పాల్పడడంతోనే వారి చెక్ పవర్ రద్దైందన్నారు. పనులు చేయకుండా లక్షలాది రూపాయలు స్వాహా చేయడంతో.. అధికారులు రికార్డులు పరిశీలించి చెక్‌పవర్ రద్దు చేశారన్నారు. ఇందులో కూటమి ప్రభుత్వానికి సంబంధం ఏముందని ప్రశ్నించారు. అవినీతి, అక్రమాలకు ఎవరు పాల్పడుతున్నది ప్రజలందరికీ తెలుసునన్నారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ స్థలాలను ఎవరు ఆక్రమించినదీ మండల ప్రజలందరికీ తెలుసన్నారు. అధికారం అడ్డం పెట్టుకుని కోట్లాది రూపాయలు స్వాహా చేసిన మీరా నీతులు చెప్పేది అని ఎద్దేవా చేశారు. నీవు నీతులు చెబుతుంటే వినేవారు ఇక్కడ ఎవరూ లేరని.. ఇప్పటికైనా ప్రభుత్వంపై నిందలు మానుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఎస్వీ రమణ, పత్తి సుబ్బరాయుడు, నల్లగుండు వెంకటసుబ్బారెడ్డి, ఎంపీటీసీ సుంకేసుల బాషా, గజ్జల శ్రీనివాసులరెడ్డి, హరినాథ్‌రెడ్డి, రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

నందలూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా శుక్రవారం సయ్యద్ మగ్దుమా ఖాదర్‌వలీ దర్గా పీఠాదిపతులు ఖాజా సయ్యద్ షా మొహమ్మద్ మొయినుద్దీన్ హుస్సేని ఖాద్రి ఆధ్వర్యంలో నందలూరు దర్గా నుంచి అరవపల్లె రైల్వేకేంద్రంలోని ఖాదర్‌వలి దర్గా వరకు ర్యాలీ నిర్వహించారు. రాజంపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బీవీ రమణ, నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణ, టీడీపీ నాయకులు మోడపోతుల రాము అన్నదానాన్ని ప్రారంభిం చారు. దర్గా కమిటీ వారిని శాలువాతో ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో సయ్యద్ అమీర్, కమాల్‌బాషా, పఠాన్ కరీముల్లా, ఖాన్, షేక్ చలపతి, సయ్యద్ ఇగ్బాల్, తాటి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.





మదనపల్లె పురపాలక సంఘం

ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

ఆర్.ఓ.సి.నెం.1394/MGF/E1/2025 తేది: 05-09-2025

మదనపల్లె పురపాలక సంఘము నందు క్రింద తెలిపిన పనులకు గాను ఈ- ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది.

వ.నెం	కాల్	నిధులు	టెండరు ఐడీలు	ECV మొత్తం
1	1st Call	సాధారణ నిధులు (పనులు)	841530	రూ.1.19లక్షలు
2.	1st Call	సాధారణ నిధులు (పనులు)	841593,841604,841616, 841635,841679,842787, 842789.	రూ.23.49 లక్షలు
3.	1st Call	సాధారణ నిధులు (పనులు)	841700,841718,841732, 841740,842753,842758, 842764,842769,842773, 842778, 842782	రూ.51.92 లక్షలు
4.	2nd Call	15th FCG 2020-21- 2nd Installment	842794	రూ.34.83 లక్షలు

పై పనులకు సంబంధించిన పూర్తి వివరముల కొరకు e-procurement market place నందు చూడవలెను మరియు ఆఫీసు పనివేళలందు సంబంధిత అధికారులను సంప్రదించగలరు.

వరుస నెం. 1
బిడ్ డాక్యుమెంటు డౌన్ లోడ్ చేసుకొనుటకు మొదలు తేది :06-09-2025: 11:00AM
బిడ్ డాక్యుమెంటు డౌన్ లోడ్ చేసుకొనుటకు చివరి తేది :10-09-2025: 11:00AM
బిడ్ డాక్యుమెంటు స్వీకరించుటకు చివరి తేది :10-09-2025: 11:15AM

వరుస నెం.2
బిడ్ డాక్యుమెంటు డౌన్ లోడ్ చేసుకొనుటకు మొదలు తేది :06-09-2025: 11:00AM
బిడ్ డాక్యుమెంటు డౌన్ లోడ్ చేసుకొనుటకు చివరి తేది :16-09-2025: 11:00AM
బిడ్ డాక్యుమెంటు స్వీకరించుటకు చివరి తేది :16-09-2025: 11:15AM

వరుస నెం.3&4
బిడ్ డాక్యుమెంటు డౌన్ లోడ్ చేసుకొనుటకు మొదలు తేదీ :06-09-2025: 11:00AM
బిడ్ డాక్యుమెంటు డౌన్ లోడ్ చేసుకొనుటకు చివరి తేది :24-09-2025: 11:00AM
బిడ్ డాక్యుమెంటు స్వీకరించుటకు చివరి తేది :24-09-2025: 11:15AM

షరతులు: ఏ కారణము తెలుపకుండా టెండరును పాక్షికముగా కాని, పూర్తిగా కాని రద్దుపరచుటకు/ నిరాకరించుటకు కమీషనరు వారికి పూర్తి అధికారములు కలవు.

సం/- కమీషనరు, మదనపల్లె పురపాలక సంఘం

ఘనంగా శ్రీవారి కల్యాణం

రాజంపేట టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండల పరిధిలోని వెంకటరాజంపేటలో శుక్రవారం శ్రీవారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని శ్రీదేవి భూదేవి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించారు. శ్రీవారి కల్యాణాన్ని చూసేందుకు గ్రామ నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. అనంతరం అన్నదానం చేశారు.

భువనేశ్వరికి పూజలు

రైల్వేకోడూరు: స్థానిక భుజంగేశ్వరాలయంలో శుక్రవారం భువనేశ్వరికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



పూర్వ విద్యార్థుల చేయూత

- రూ.2.50 లక్షలతో కళావేదిక నిర్మాణం, రాధాకృష్ణన్ విగ్రహం వితరణ



రాధాకృష్ణన్ విగ్రహం వద్ద పూర్వ విద్యార్థులు

ములకలచెరువు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బురకాయలకోట జడ్పీ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థులు చేయూతనిచ్చారు. పాఠశాలలో 1986-87లో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు రూ.2.50 లక్షలతో కళావేదిక (స్టేజీ) నిర్మించడంతో పాటు డాక్టర్ సర్వేపల్లె రాధాకృష్ణన్ విగ్రహాన్ని వితరణ చేశారు. గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం పూర్వ విద్యార్థులు నిర్మించిన కళావేదికలో సర్వేపల్లె రాధాకృష్ణన్ విగ్రహం ఏర్పాటు చేశారు. ఇక్కడే గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే తమకు చదువు చెప్పిన గురువు రామకృష్ణమరాజుతో పాటు ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న టీచర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో పూర్వ విద్యార్థులు గుత్తికొండ త్యాగరాజు, సీవీ రెడ్డి, మంగరాజు, బాబు, లక్ష్మన్న, మద్దిరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, పీవీ రమణ, మిలటరీ నరసింహుడు, రామచంద్ర, సంధ్యారాణి, సునంద, రెడ్డెమ్మ, ప్రమీల, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

కారుకు నిప్పు - కేసు నమోదు



కాలిపోయిన మారుతీకారు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంటి సమీపంలో నిలిపి ఉంచిన తన మారుతీకారుకు శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు స్థానిక పాత మసీదు ప్రాంతానికి చెందిన అన్వర్‌బాషా తెలిపారు. కొన్నేళ్లుగా తన ఇంటి సమీపం లోని చెట్టు కింద కారు పెడుతున్నామని, శుక్రవారం తెల్లవారు జామున కారు టైరు పగిలిన శబ్దం రావడంతో బయటకు వచ్చి చూసేసరికి కారు మంటల్లో కాలుతూ కనిపించిందన్నారు. పోలీసు లకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ రవీంద్రబాబు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు బాధితుడు అన్వర్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న బొలెరో

- రైతుకు తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడ్డ శివారెడ్డి

ములకలచెరువు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముంబై-చెన్నై జాతీయ రహదారిలోని వేపూరికోట పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం బొలెరో వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజుగారిపల్లెకు చెందిన రైతు శివారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని దేవళచెరువు పంచాయతీ రాజుగారిపల్లెకు చెందిన రైతు శివారెడ్డి(45) పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో వేపూరికోటకు వచ్చాడు. ఈ క్రమంలో పెట్రోల్ బంకులో పెట్రోల్ పట్టుకునేందుకు వెళ్తుండగా బొలెరో వాహనం ఢీకొంది. దీంతో రైతు తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వినాయక నిమజ్జనం అడ్డగింత



విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న దళితులు

నందలూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్తపి గ్రామంలో దళితులు నిర్వహిస్తున్న వినాయకుడి నిమజ్జనాన్ని అగ్రవర్ణాలవారు అడ్డుకున్నారు. దళితుల కథనం మేరకు.. గురువారం రాత్రి పొత్తపి హరిజనవాడకు చెందిన దళితులు వినాయకుడిని నిమజ్జనం చేసేందుకు ఊరేగింపుగా వెళుతుండగా, అగ్రవర్ణాల వారు రాళ్లు, కట్టెలతో దాడికి ప్రయత్నించగా, అక్కడి నుంచి పారిపోయి పోలీసులను ఆశ్రయించారు. తమపై దాడికి యత్నించిన ఐదుగురిపై చర్యలు తీసుకోవాలని దళితులు కోరారు.

జూదరుల అరెస్ట్

రాజంపేటటౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని భవానినగర్ సమీపంలో పేకాట ఆడుతున్న 11 మందిని శుక్రవారం అదుపులోకి తీసుకొని, రూ.15 వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగార్జున తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవానినగర్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ వెంకటేష్, సిబ్బంది దాడి చేశారని తెలిపారు.

రేపు జమ్మలమడుగులో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జూనియర్ జట్లు ఎంపిక

రాజంపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7న ఆదివారం జమ్మలమడుగు మండలం ఎస్.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి కడప జిల్లా జూనియర్ బాల బాలికల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.కృష్ణమూర్తి, జి.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎంపికలకు ఫిబ్రవరి 1, 2006 తర్వాత జన్మించినవారు అర్హులని తెలియజేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 12, 13, 14 తేదీల్లో అనంతపురం జిల్లా బత్తలపల్లి మండలం రామాపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. క్రీడాకారులు సెలక్షన్‌కు వచ్చేటప్పుడు పుట్టిన తేదీ గల ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్స్, పదో తరగతి మార్కుల జాబితా, 8 ఫొటోలు, డ్రెస్‌కోడ్, షూ, తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. వివరాలకు 9490181104, 7036907303 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేవారికి గ్రామ పెద్ద శ్రీనివాసులరెడ్డి ఉచిత భోజనం ఏర్పాటు చేయనున్నారని వివరించారు.

వ్యర్థాల సేకరణకు స్వచ్ఛరథం

- ఈ నెల 15 నుంచి పీలేరులో ప్రారంభం
- ప్లాస్టిక్ వస్తువులు, అట్టపెట్టెలు తీసుకొని నిత్యావసరాల పంపిణీ
- ప్లాస్టిక్ రహిత గ్రామాలే లక్ష్యం
- పంచాయతీలపై అదనపు భారం ఉండదు
- గుంటూరు జిల్లా లాలాపురం పైలెట్ ప్రాజెక్ట్ సక్సెస్
- డీపీఓ రాధమ్మ





పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం, (ఇన్‌సెట్లో) స్వచ్ఛరథంలో ఇవ్వనున్న నిత్యావసర సరుకులు

పీలేరురూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను ప్లాస్టిక్ వ్యర్థాల రహితంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా స్వచ్ఛ రథం పేరుతో ఏర్పాటు చేసిన వాహనాల ద్వారా ప్లాస్టిక్ వస్తువులు సహా ఐరన్, అట్ట పెట్టెలు, ఇతర పనికిరాని వస్తువులు తీసుకొని దానికి బదులుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తోంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ రథాలను గుంటూరు జిల్లా లాలూపురంలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేశారు. ఇక్కడ ఈ పథకం సక్సెస్ కావడంతో అన్నమయ్య జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా పీలేరు మేజర్ గ్రామ పంచాయతీలో ఈ నెల 15 నుంచి స్వచ్ఛరథం ప్రారంభించనున్నారు. వీటి ద్వారా వాటర్ బాటిళ్లు, పాలిథీన్ సంచులు, పాడైన ప్లాస్టిక్ వస్తువులు, ఇలా ఇంట్లో పనికిరాని వాటిని బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా స్వచ్ఛ రథం ద్వారా సేకరించనున్నారు. వ్యర్థాలు తీసుకుని ఇచ్చే నిత్యావసరాల్లో పప్పు, ఉప్పు, చింతపండు, సబ్బులు వంటివి ఉన్నాయి.



వ్యర్థాల సేకరణకు ఉపయోగించే స్వచ్ఛరథం

కూటమి ప్రభుత్వం వినూత్న ఆలోచనతో తడి పొడి చెత్తతో పాటు నిరుపయోగమైన ప్లాస్టిక్ తదితర వేస్ట్ సేకరణ కోసం ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) లను రద్దు చేసింది. ఇందుకోసం గతంలో ఉపయోగించిన వాహనాల ఆపరేటర్లకు ఉపాధి కల్పించడంతో పాటు ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను సేకరించేందుకు వాటిని వినియోగిస్తారు. నెలకు ఒక్కో వాహనానికి రూ.21 వేల నుంచి రూ.25 వేలు ఇవ్వనున్నారు. ప్రజల నుంచి సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను బయటి మార్కెట్‌లో విక్రయించి వాటికి సరిపడా నిత్యావసర సరుకులు తెచ్చుకునే బాధ్యత ఎండీయూ ఆపరేటర్లకు అప్పగించారు.

చెత్త తీసుకొని ఇచ్చేవి...

'స్వచ్ఛ రథం' వద్ద పాత ఇనుము, పేపర్లు, పుస్తకాలు, అట్టపెట్టెలు, ప్లాస్టిక్, గాజుసీసాలు, స్టీల్, అల్యూమినియం తదితర పాడైన వస్తువులు తీసుకొంటారు. వీటికి విలువ కట్టి నిత్యావసరాలైన కొబ్బరి నూనె, సర్ఫ్ ప్యాకెట్లు, ఉల్లిపాయలు, బట్టల సబ్బులు, ఒంటి సబ్బులు, టీ, కాఫీ, పౌడర్లు, లేస్ పాకెట్లు, పేస్ట్, షాంపూ ప్యాకెట్లు, ఉల్లిపాయలు, టూత్ బ్రష్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, గోధుమ పిండి, వేరుశనగ గుళ్లు, మినపగుళ్లు, కందిపప్పు తదితర నిత్యావసరాలు ఇస్తారు. కేజీ ప్లాస్టిక్‌కు రూ.20 చొప్పున నిత్యావసర సరుకులు ఇస్తారు.

పంచాయతీపై ఆర్థిక భారం ఉండదు

- రాధమ్మ, డీపీఓ



స్వచ్ఛ రథం పథకాన్ని పీలేరులో ఆగస్టులో ప్రారంభించాలని అనుకున్నాం. అయితే కొంత ఆలస్యమైంది. ఈ నెల 15 నుంచి పీలేరులో స్వచ్ఛరథం ప్రారంభిస్తాం. దీనివల్ల పంచాయతీపై ఎటువంటి అదనపు భారం పడదు. కేవలం వాహనం మెయింటనెన్స్ ఆపరేటర్‌కు నెల జీతం రూ.21 వేలు ఇవ్వడం జరుగుతుంది. గుంటూరు జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతమైంది. అన్నమయ్యలో పీలేరు మేజర్ పంచాయతీని ఎంపిక చేశాం. అనంతరం దశలు వారిగా ఇతర మండలాలకు విస్తరింపజేస్తాం. ఇళ్లలో నిరుపయోగమైన వ్యర్థాలను ఇచ్చి నిత్యావసర సరుకులు తీసుకోవడం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగం.

ముగిసిన వెంకన్న పవిత్రోత్సవాలు

- వైభవంగా పూర్ణాహుతి

తంబళ్లపల్లె, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో గత నాలుగు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతున్న వార్షిక పవిత్రోత్సవాలు మహాపూర్ణాహుతితో వైభవంగా ముగిశాయి. శుక్రవారం తెల్లవారుజామున వేదపండితులు శ్రీవారిని సుప్రభాతంతో మేల్కొలిపి దూపదీప నైవేద్యాలతో సహస్రనామార్చన, నిత్యకైంకర్యాలు పూర్తి చేశారు. యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చతుస్థానార్చన, మహా పూర్ణాహుతి, కుంభప్రోక్షణ, పవిత్ర విసర్జన పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనే, చందనం, నెయ్యి, పసుపు, కొబ్బరినీళ్లతో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకిపై కొలువుదీర్చి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు వరలక్ష్మీ, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్ భట్టర్, ఉప ప్రధాన అర్చకులు రమేష్ స్వామి, సిబ్బంది నగేష్ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారిని ఊరేగింపుగా తీసుకువెళ్తున్న టీటీడీ అధికారులు, వేదపండితులు

పెట్రోల్ పోసి నిప్పుపెట్టిన కేసులో..

ఆరుగురు నిందితులు అరెస్టు

- రిమాండ్‌కు తరలింపు



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ పోసి నిప్పు పెట్టిన కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. ఈ నెల 3వ తేదీన మదనపల్లె పట్టణం, బీకేపల్లెలోని వైఎస్సార్ కాలనీలో ఓ వ్యక్తిపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టిన కేసులో ఆరుగురిని గుర్తుంచి అరెస్టు చేసినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టూటౌన్ పోలీసుస్టేషన్‌లో మిడియాతో డీఎస్పీ మాట్లాడుతూ అన్నదమ్ముల ఆస్తి వివాదాల నేపథ్యంలో సలీంబాషా ఇంటిపై రాయచోటి వాసులు దాడి యత్నాన్ని అడుకున్న రమేష్ నాయక్‌పై పెట్రోల్ పోసి నిప్పు అంటించి చంపడానికి ప్రయత్నించిన కేసులో నిందితులు రాయచోటికి చెందిన ఖాసీం సాహెబ్ కుమారులు షేక్ జావీద్ హుసేన్, షేక్ సామీర్ హుసేన్, జీలాని బాషా కుమారుడు షేక్ ఇలాహి అలియాజ్ ఫాజిల్, కలికిరి మండలం వాసి అబ్దుల్ మజీద్ కుమారుడు వేంపల్లె మస్తాన్, కేవిపల్లె మండలం, తిమ్మాపురం గ్రామం, కొత్తఇండ్లుకు చెందిన ఇమాంసాహెబ్ కుమారుడు షేక్ అమీర్ సాహెబ్, కలి కిరి మండలం, గుండ్లూరుకు చెందిన సుధాకర్ కుమారుడు విశ్వనాథ్‌బాబు ఉన్నారన్నారు. వైఎస్సార్ కాలనీలో ఉన్న షేక్ సలీంబాష తండ్రి షేక్ మహబూబ్ బాషా, అతని అన్న రాయచోటికి చెందిన ఖాషీం సాహెబ్ ఆస్తి విషయమై మనస్పర్థలు ఉండేవని, ఏడాది కిందట షేక్ మహబూబ్‌బాషా మృతి చెందాడని, ఇరు కుటుంబాల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఆగస్టు 15వ తేదీన కూడా మదనపల్లెకు వచ్చి ఘర్షణ పడ్డారని చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 3 వతేదీ ఫోన్‌లో గొడవపడ్డారని వెంటనే పథకం ప్రకారం రాయచోటి నుంచి కారులో వచ్చి మార్గమధ్యలో బాటిల్‌లో పెట్రోలు తీసుకొచ్చా రని వివరించారు. 3 వతేదీ తెల్లవారుజామున 4 గంటలకు బీకేపల్లె చేరుకుని సలీంబాషా నివాసం ఉన్న పైగది వెళ్ల డానికి అక్కడ గేట్‌ను, షట్టర్‌ను పగలకొట్టడానికి ప్రయత్నం చేస్తుండగా శబ్దం రావడంతో సలీం బాషా ఇంట్లో బాడుగకు ఉంటున్న రమేష్‌నాయక్ చూసి అడ్డుకోవడంతో అతనిపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టారు. గమనించిన మరో వ్యక్తి బైక్‌పై రావడంతో ఆ బైక్‌ను కూడా ధ్వంసం చేశారని చెప్పారు. ఈ మేరకు వారిపై హత్యాయత్నం, ఎస్సీఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ప్రస్తుతం గాయపడిన రమేశ్‌నాయక్ బెంగళూరులో చికిత్స పొందుతున్నాడు. రాబడిన సమాచారం మేరకు వారిని మదనపల్లె పట్టణం, రామారావు కాలనీ, ఆటోస్టాండ్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో అరెస్టు చేసినట్లు చెప్పారు.

మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న గౌతమ్‌కుమార్

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు తీసుకున్న పీపీపీ మోడల్‌ను వెంటనే విరమించుకోవాలని, మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ - పబ్లిక్ - పార్టనర్‌షిప్ విధానంతో రోడ్లు, వైద్యం, యుటిలిటీ వంటి ప్రజా సేవలు ప్రైవేట్ పరం చేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులు మెడికల్ కళాశాలల్లో రిజర్వేషన్ కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు మదనపల్లె ప్రజలు రాజకీయ భిక్ష పెడితే ఆ ప్రజల నోట్లో మట్టి కొడుతున్నారన్నారు. ప్రతిపక్షంలో అనేక ఉద్యమాల్లో పాల్గొన్న విషయాలను ఎమ్మెల్యే షాజహాన్ బాషా గుర్తుపెట్టుకోవాలన్నారు. మదనపల్లె మెడికల్ కళాశాల ప్రైవేట్ పరం చేయాలని చూస్తే ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తన పదవికి రాజీనామా చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. నిన్నటి కేబినెట్‌లో అన్ని మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలని ఆమోదించడం దారుణమన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు బీఎస్పీ పిలుపునిస్తోందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నేతలు సహదేవ, చంద్ర, బాలజీ, మహేష్, ప్రశాంత్, శివ, అనిల్,రెడ్డెప్ప, వేణు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వైద్యం దూరమైనట్లే

మదనపల్లె మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట సీపీఎం నిరసన చేపట్టింది. జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ పీపీపీ పద్ధతి రద్దు చేయాలని, ప్రభుత్వ ఆస్పత్రిని ప్రైవేటీకరణ చేయెద్దు అంటూ పెద్దఎత్తున నినాదాలు చేపట్టారు. మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం కోలార్ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి వైద్య సేవలను పొందుతున్నారన్నారు. మెడికల్ కళాశాల అభివృద్ధి అయితే అన్ని రకాల వైద్య సేవలు ఇక్కడే పొందవచ్చన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాది సోముశేఖర్, సీపీఎం నేతలు ప్రభాకర్ రెడ్డి, నరసింహ, నాగరాజ, ఆఫ్రీద్, జయబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల భూ దందాపై సీఎంకు వినతి



సీఎంను కలిసి వివరిస్తున్న పుల్లంపేట టీడీపీ నాయకులు

పుల్లంపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు ఆక్రమించారని, దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో రైల్వే కోడూరు మార్కెట్‌కమిటీ మాజీ ఛైర్మన్ నేలపాటి రామచంద్ర నాయుడు, మండల మాజీ ఇన్‌చార్జి పోలూరు కృష్ణమనాయుడు, మండల యూత్ నాయకులు ముద్దా సుభాష్‌రెడ్డి శుక్రవారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసి ఫిర్యాదు చేశారు. మండలంలోని అనంతసముద్రం, వత్తలూరు, తిప్పాయపల్లె ప్రాంతాల్లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూముల కబ్జా చేయడంతోపాటు, కొందరి నుంచి బలవంతంగా లాక్కొని అమ్మివేశారని సర్వేనంబర్లతో సహా ముఖ్యమంత్రికి వివరించారు. మండలానికి పెద్దఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని విన్నవించుకున్నారు. రైల్వే కోడూరు నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి సీఎంకు వివరించారు.

యునాని వైద్య కళాశాలకు స్థలం కేటాయింపుపై హర్షం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో యునాని వైద్య కళాశాల కోసం రాష్ట్ర ప్రభుత్వం 10 ఎకరాలు స్థలం కేటాయించడంపై అన్నమయ్య జిల్లా రియాసతి ఉర్దూ ఉపాధ్యాయ సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా జరిగిన నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం అధ్యక్షుడు సిబాతుర్ రెహమాన్ మాట్లాడుతూ ఉర్దూ విద్యార్థులు ఎక్కువగా ఉన్న రాయచోటి ప్రాంతంలో యునాని వైద్య కళాశాల ఏర్పాటుతో చాలా మంది వైద్య విద్యను అభ్యసించడానికి అవకాశం ఉంటుందన్నారు. సంఘం రాష్ట్ర కోశాదికారి అసదుల్లాషా మాట్లాడుతూ గత శతాబ్దకాలంగా రాయచోటిలోని డైట్ కళాశాల వేల మంది ఉర్దూ ఉపాధ్యాయులను అందించిందని, యునాని కళాశాల వస్తే ఎంతో మంది యునాని వైద్యులు సిద్ధమవుతారన్నారు. అనంతరం ఉపాధ్యాయులు మహమ్మద్‌అలీ, ఇలియాస్ మాట్లాడుతూ ఈ కళాశాల మంజూరుకు సహకరించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. రూటా రాష్ట్ర సభ్యులు మహమ్మద్ అలీ, ఇలియాస్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ జాఫరుద్దీన్, కోశాధికారి ముహిబుల్లా తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యార్థినికి పాముకాటు



రాయచోటి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని వైష్ణవి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సుండుపల్లె రోడ్డులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల పదో తరగతి విద్యార్థిని పాము కాటుకు గురైంది. మండల పరిధిలోని శిబ్యాల గ్రామ హరిజనవాడకు చెందిన వైష్ణవి శుక్రవారం ఉదయం పాఠశాల ఆవరణలో చదువుకుంటూ ఉండగా కుడికాలి బొటనవేలిపై పాము కాటు వేయడంతో, పాఠశాల సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ విద్యార్థిని రాయచోటి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యులు అంటున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు ఆసుపత్రికి చేరుకుని సంఘటనపై ఆరా తీశారు. ఇదిలా ఉండగా పాఠశాల చుట్టూ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు ఏపుగా ఉండడంతోనే విషపురుగులు పాఠశాలలో సంచరిస్తున్నాయని, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆలిండియా స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుమ్మల లవకుమార్ డిమాండ్ చేశారు.

కడప జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..



కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్సీలు రాంగోపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, ఎస్పీ అశోక్‌కుమార్, డీఈవో షంషుద్దీన్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న ప్రధానోపాధ్యాయురాలు పి.నాగమణి



జె.మెర్సీమాలిని | కేవీ నాగిరెడ్డి | ఎన్.సరస్వతీ | ఎం.రామకృష్ణమ్మ | కె.లక్ష్మీకేశమ్మ | శ్రీ దీపారెడ్డి | వి. జనార్దన్ | డి. నాగరాజు | కె. నాగార్జున | టి. సావిత్రమ్మ | పీవీ పద్మనాభరెడ్డి



పి. నాగకృష్ణారెడ్డి | ఎస్. నూర్ | పి.భార్గవిప్రియదర్శిణి | బి. సుధాకర్‌రెడ్డి | పి.మహాలక్ష్మి | పి. శ్రీదీప | ఎ. ఎరుకలరెడ్డి | వీవీ గాయత్రి | ఎన్ఆర్‌వీ ప్రసాద్‌రెడ్డి | ఎస్.ఫిరోజ్‌జాన్ | ఎస్.గురవయ్య | పీఆర్ మంజులాదేవి | ఎస్.ఓబయ్య



ఎ.అరుణకుమారి | కె.రవిశంకర్ | బీవీ సుబ్బారెడ్డి | ఎస్.సయ్యద్‌బాష | ఎస్ఏ చాంద్‌బాష | ఎస్తేర్ సుకుమారి | టి. రామకృష్ణ | జె.సుబ్రమణ్యం | జి.గోపీనాథ్ | ఎం.శివప్రసాద్ | సుచిత్రకుమారి | కె.కృష్ణయ్య | జి.శివరామకృష్ణమరాజు



బి.శ్రీనివాసులు | ఎస్.ఖాసీంవల్లీ | పి.సుహాసిని | బి.భాస్కర్‌రెడ్డి | ఎస్.రామకృష్ణారెడ్డి | బి.ఆదిశేషారెడ్డి | కె.వెంకటసుబ్బన్న | డి.దస్తగిరి | ఎన్.రాజారావ్ | సి.వీరారెడ్డి | ఆర్.గురవయ్య | ఆర్‌వీ సౌభాగ్యలక్ష్మీదేవి | కె.రాధిక



మేరీ సువర్ణ | ఎన్.శ్రీనివాసులు | ఎ.పెంచలయ్య | బి.ప్రభుభూషణ | పి.గాయత్రి | బి.ఈశ్వర్‌రావు | సి.సుదర్శన్ | టి.శ్రీనివాసులు | ఐ.రహీంబకాష్ | ఎస్.ఫాతిమాసుల్తానా | ఎస్.హబీదున్నీసా బేగం | ఏ.ఫరీదాభాను | వెంకటసుబ్బయ్య

అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తన భర్త, అత్తమామలు, మరిది అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని వి.సునీత అనే మహిళ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ ఆర్‌వీ కొండారెడ్డి తెలిపారు. మండలంలోని కొరపాటిపల్లె పంచాయతీ ఇందిరానగర్‌కు చెందిన వీధిపోగు సునీతకు 2020 సంవత్సరం మైదుకూరు మండలం విశ్వనాధపురానికి చెందిన సిరివెళ్ల పవన్‌కళ్యాణ్‌తో వివాహం జరిగింది. వివాహం తరువాత పిల్లలు పుట్టలేదని, కట్నం తీసుకురమ్మని తనను మానసికంగా శారీరకంగా ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బ్రాందీషాపులో చోరీ

● మద్యం బాటిళ్లు, నగదు అపహరణ



చోరీకి పాల్పడుతున్న వ్యక్తి ఫొటో సీసీ పుటేజీలో రికార్డయిన దృశ్యం

ఖాజీపేట సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని కోటంగురాయునిపల్లె వద్ద గల ఎస్ఎల్‌బీ వైన్స్‌లో శుక్రవారం తెల్లవారు జామున చోరీ జరిగింది. యజమాని నెల్లూరప్ప యాదవ్ వివరాల మేరకు... రోజు దినచర్యలో భాగంగా రాత్రి 10 గంటలకు అన్ని డోర్లు లాక్ చేసి వెళ్లామని, శుక్రవారం ఉదయం అంగడి తెరువగా లోపల వెనుక భాగంలో గల డోరు తెరచి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. క్యాష్ కౌంటర్‌లోగల రూ.10వేలు నగదు, అయిదు కేసుల మందు తీసుకెళ్లినట్లు సీసీ పుటేజీలో ఉందన్నారు. ఈ మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అదుపు తప్పి కాలువలో పడి మహిళ మృతి

మైదుకూరు రూరల్,సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిప్పిరెడ్డిపల్లె సమీపంలోని తెలుగుగంగ కాలువలో జారిపడి గుండంరాజు లక్ష్మమ్మ (75) అనే మహిళ మృతి చెందారు. సీఐ రమణారెడ్డి వివరాల మేరకు... మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని బండివారిపల్లె గ్రామానికి చెందిన లక్ష్మమ్మ పొలం పనులకు వెళ్లింది. ఆ సమయంలో బహిర్భూమికి వెళ్లి కాలుజారి కాలువలో పడి మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీరాములు

కమలాపురం రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గంగవరం గ్రామ సమీపంలోని కాశినాయన దేవాలయం వద్ద ఓ వ్యక్తిని సిమెంటు ట్యాంకర్ ఢీకొన డంతో తీవ్ర గాయాల య్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. మైదుకూరు మండలం బదిరేపల్లె గ్రామానికి చెందిన కామనూరు శ్రీరాములు అనే వ్యక్తి గంగవరం గ్రామ సమీపంలో కాశినాయన ఆలయం సమీపంలో అరు గుపై కూర్చుని బంధువులతో మాట్లాడుతున్నాడు. అదే సమయంలో ఖాజీపేట నుంచి కమలాపురం వైపు వస్తున్న సిమెంటు లారీ ప్రమాద వశాత్తు ఢీకొట్టింది. దీంతో శ్రీరాములుకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తరలించి చికిత్స అందించారు. డ్రైవరు మద్యం మత్తులో ఉండడమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.

160 పరుగులతో నెల్లూరు జట్టు ఘన విజయం

● డ్రాగా ముగిసిన కడప- కర్నూలు మ్యాచ్

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ మల్టీడే (మూడురోజుల) క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా చివరి రోజైన శుక్రవారం వివిధ జట్ల మధ్య పోటీలు రసవత్తరంగా సాగాయి. ఇందులో అనంతపురం జట్టుపై నెల్లూరు జట్టు 160 పరుగులతో విజయం సాధించింది. కడప- కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్ డ్రాగా ముగిసింది. వివరాలిలా...

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో 44.4 ఓవర్లలో 239 పరుగులు చేసింది. అనంతపురం జట్టు 43.3 ఓవర్లలో 242 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో అనంతపురం జట్టుకు 3 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. రెండవ ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు 60 ఓవర్లలో 350 పరుగులకు ఆలౌట్ అయింది. 347 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు చివరి రోజు 48.1 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో నెల్లూరు జట్టు 160 పరుగుల తేడాతో గెలుపొందింది.

నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 88.4 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 374 పరుగులకు డిక్లేర్ చేసింది. తదనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 67.3 ఓవర్లలో 314 పరుగులు చేసింది. దీంతో కడప జట్టుకు 60 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది.

ఆటకు చివరి రోజైన కడప జట్టు రెండో ఇన్నింగ్స్‌కు దిగి 80 ఓవర్లలో 297 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. ఇందులో శివకేశవ 66 పరుగులు, ఆదిల్‌హుస్సేన్ 58 పరుగులు చేశారు. అనంతరం కర్నూలు జట్టు తన రెండో ఇన్నింగ్స్‌కు దిగి ఆట ముగిసే సమయానికి 3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 40 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

గణనాథునికి ఘనంగా కుంకుమార్చన



దేవరగుట్టపల్లెలో గణనాథునికి మహిళలచే కుంకుమార్చన

చక్రాయపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెర్సు పల్లె గ్రామం దేవరగుట్టపల్లెలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి 500 మంది మహిళలతో కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచు సుబ్బరామయ్య కుమారుడు రాహుల్ ఆధ్వ ర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కుంకుమార్చనలో పాల్గొన్న మహి ళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఇసుక ట్రాక్టరు బోల్తా... డ్రైవరుకు గాయాలు



సంఘటనా స్థలం వద్ద బోల్తాపడిన ట్రాక్టరు

వల్లూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జంగంపల్లె గ్రామ సమీపాన ఇసుక లోడుతో వెళుతున్న ట్రాక్టరు బోల్తా పడటంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. కడపకు ఇసుక తరలిస్తున్న ట్రాక్టరు అదుపు తప్పి పైడికాల్వ క్రాస్ వద్ద రోడ్డుపై బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టరు డ్రైవరుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి 108 వాహనంకు సమాచారం అందించారు. గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రేపు ఆలయాల మూసివేత

కడప కల్చరల్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యో తి): సంపూర్ణ చంద్ర గ్రహణం సందర్భంగా ఈనెల 7వ తేదీ ఆదివారం జిల్లాలోని ఆలయాలను మధ్యాహ్నం 3-30 గంటల నుంచి మూసివేయనున్నట్లు జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ జి. మల్లికార్జున ప్రసాద్ తెలిపారు. తిరిగి 8వ తేదీ సోమవారం ఉదయం ఆలయాల శుద్ధి, సంప్రోక్షణ చేసి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. భక్తులు ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించాలని కోరారు.

ఆలోచన అదిరిందయ్యా.. శీనయ్య !

ఓ రైతు తాను సాగు చేసిన పంటను కాపాడేందుకు వినూత్నంగా ఆలోచించాడు. పాత దువ్వూరుకు శ్రీనివాసులునాయుడు గ్రామ సమీపంలో పసుపు పంట సాగు చేశాడు. పసుపుతోటకు పక్కనే చింతచెట్లు ఉన్నాయి. వాటిపై ఉన్న కోతులు నిత్యం తోటలోకి వచ్చి మొక్కలు పీకివేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతు శ్రీనివాసులు నాయుడు కోతులతో విసుగుచెందాడు. పంటను కాపాడుకునేందుకు సమీప పొలంలో స్పీకర్ పొట్టాడు. బౌబౌ అంటూ ఒక శబ్దంతో కూడిన స్పీకర్‌ను అమర్చాడు. కుక్క వచ్చి అరచినట్లు, రాళ్లు గలకరించిన శబ్దంతో స్పీకర్ పనిచేయడంతో కోతులు ఆ సమీపంలోకి వచ్చేందుకు భయపడుతున్నాయి. దీంతో రైతు ప్రయత్నం ఫలించింది. ఇది చూసిన తోటి రైతులు అదిరిందయ్యా శీనయ్య అంటూ మెచ్చుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి - దువ్వూరు)



కోతుల బెడద నివారించేందుకు ఏర్పాటు చేసిన లౌడ్‌స్పీకర్



పొలంలో కోతులు పీకివేసిన పసుపు మొక్కలు

నవసమాజ నిర్మాతలు గురువులే

మదనపల్లెలో ఘనంగా గురుపూజోత్సవం ● ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న పలువురు టీచర్లు



ఎమ్మెల్యే షాజహాన్ బాషతో అవార్డు అందుకుంటున్న సీటీఎం జడ్పీహైస్కూల్ టీచర్ ధరణి కుమారి



డిప్యూటీ డీవైఈఓ లోకేశ్వర్ రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు - జిల్లా స్థాయిలో సన్మానం పొందిన కలికిరి మండల ఉపాధ్యాయులు - పీలేరులో విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు



జంగంపల్లెలో సర్వేపల్లె రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నవసమాజ నిర్మాతలు గురువులే అని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కొనియాడారు. స్థానిక ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్లో దివంగత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా నియోజకవర్గంలోని 100 మంది ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు అందించి సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్షరాస్యత అధికంగా ఉన్న దేశం, రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని, అక్షరాస్యత నేర్పే గురువులే దేశ ఆర్థికాభివృద్ధికి మూలమన్నారు. టౌన్ బ్యాంకు చైర్మన్ విద్యాసాగర్, ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, పద్మావతి, నారాయణ, హేమలత, ఆంజనేయులు, హెచ్ఎంలు సుబ్బారెడ్డి, శ్రీదేవి, షాజహాన్, జనార్థన్‌రెడ్డి, మోహన్, శ్రీనివాసులు, చంద్రశేఖర్, రూటా మహ్మద్ ఖాన్, ఎస్టీయూ మధుసూదన్, యూటీఎఫ్ సుధాకర్ నాయుడు, ఆపస్ రమణారెడ్డి, మున్సిపల్ టీచర్స్ అసోసియేషన్ మధు, ఇస్మాయిల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీలేరు ఎంఆర్‌సీలో....

పీలేరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని విద్యాసంస్థల్లో ఘనంగా చేసుకున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాన్ని ఆవిష్కరించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఎంఆర్‌సీలో మదనపల్లె డిప్యూటీ డీవైఈఓ, పీలేరు ఎంఈఓ-1 లోకేశ్వరరెడ్డి మాట్లాడుతూ సాధారణ ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించి దేశంలో అత్యున్నత స్థానమైన రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన రాధాకృష్ణన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జ్యూరీ అవార్డుకు ఎంపికైన ఆయనను ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నేతలు ఘనంగా సన్మానించారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు బాలకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డిని సన్మానించారు. జంగంపల్లె జడ్పీ హైస్కూల్ హెచ్ఎం తాటిపర్తి గంగాధరం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. వేర్వేరు కార్యక్రమాల్లో ఎంఈఓ-2 పద్మావతమ్మ, ఉపాధ్యాయులు రాచపల్లె కృష్ణమూర్తి, జీసీ మహేశ్ రెడ్డి, షరీఫ్, లక్ష్మీదేవి, రామమూర్తి, రమణ య్య, ఆనందరాజు, అశోక్ కుమార్, ఫారూఖ్, సురేంద్రనాథ్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికి ఆరాధ్యుడు...

బి.కొత్తకోట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): భారత తొలి రాష్ట్రపతి, ఉపాధ్యాయ వృత్తికి ఆరాధ్యుడు డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ జన్మదినాన్ని ఘనంగా చేసుకున్నారు. మానవత సంస్థ వ్యవస్థాపకుడు క్రిష్టారెడ్డి, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంగసముద్రం రోడ్డులో, ఎంఈఓ రెడ్డిశేఖర్ ఆధ్వర్యంలో మండల వనరుల కేంద్రంలో సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సత్కరించారు. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

బద్దిపల్లె టీచర్‌కు ఉత్తమ అవార్డు

కురబలకోట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): బద్దిపల్లె టీచర్ గీతాంజలీ దేవికి ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డును మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్ అందించారు. నాలుగేళ్లగా కార్పొరేట్ పాఠశాలకు దీటుగా విద్యార్థులకు మెరుగైన విద్యను అందించిన సేవలకు గుర్తింపుగా అవార్డు వచ్చిందని అవార్డు గ్రహీత అన్నారు. అవార్డు పొందిన ఆమెను డీఈఓ సుబ్రమణ్యం, ఎంఈఓ ద్వారకనాథ్ అభినందించారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

పెద్దమండ్యం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని ఎంఈఓ మనోహర్ పేర్కొన్నారు.



మంత్రి రాం ప్రసాద్ రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ నుంచి అవార్డు అందుకుంటున్న బద్దిపల్లె టీచర్ గీతాంజలీ దేవి, మదనపల్లె జడ్పీహైస్కూల్ హెచ్ఎం సుబ్బారెడ్డి, ప్రశంసా పత్రం అందుకుంటున్న టీచర్ గురుమూర్తి

పెద్దమండ్యంలో ఎమ్మార్సీ భవనంలో ఉపాధ్యాయ దినోత్సవం చేసుకున్నారు. డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి గురువులు పూజించారు. ఎంఈఓ రామకృష్ణ, ఉపాధ్యాయ సంఘ నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరుగురికి జిల్లా అవార్డులు

కలికిరి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలం నుంచి జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కె.సుబ్బారెడ్డి, మురాద్‌షావలీ, డి.భారతి, ఎన్.సరిత, బి.సుగుణ, ఎస్.ఐజాజ్ అహ్మద్‌కు శుక్రవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్, కలెక్టర్ శ్రీధర్ అవార్డులు అందజేశారు. మండల స్థాయిలో ఎస్.హరినారాయణ, అనురాధ, ఎస్.షబానా, పి.రాజారెడ్డి, ఎం.చాముండేశ్వరయ్య, ఎస్.షఫీ ఉర్‌రహ్మాన్‌ను, విశ్రాంత ఉపాధ్యాయులు దేవేంద్ర, వెంకట్రమణారెడ్డి, అరుంధతిని సన్మానించారు. ఎంఈఓలు కరీముల్లా, నాగార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బండ్లపై టీచర్‌కు ప్రశంశాపత్రం

నిమ్మనపల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): బండ్లపై పంచాయతీ మోడల్ ప్రైమరీ పాఠశాల టీచర్ గురుమూర్తికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్, కలెక్టర్ శ్రీధర్ ఉత్తమ ప్రశంశా పత్రాన్ని అందించారు. ఉత్తమ ప్రశంశాపత్రం తన బాధ్యత పెంచిదని అవార్డు గ్రహీత అన్నారు.

ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా...

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీహై స్కూల్ హెచ్ఎం సుబ్బారెడ్డి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ నుంచి అవార్డు అందుకున్నారు.

కోలాహలంగా వినాయక నిమజ్జనం

వాల్మీకిపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటవీధిలో ఏర్పాటు చేసిన మహా విష్ణు రూప వినాయక నిమజ్జన ఉత్సవాలను స్థానిక భజరంగదళ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం విశేష పూజలు నిర్వహించి వినాయక ప్రతిమను వాహనంపై అధిష్ఠింప చేశారు. బళ్లారి వాయిద్యాలు, కోలాటాలు, బాణసంచా, విశేష భక్తజనం నడుమ వినాయకుల వారి నగరోత్సవం వైభవంగా సాగింది. క్రమశిక్షణతో యువత స్వామివారి నామం స్మరిస్తూ కోలాహలంగా వేడుకలు చేసుకున్నారు. కూరపర్తి గ్రామంలో 2.0 బుల్లి వినాయకుడికి విశేష అలంకరణలు గావించి గ్రామోత్సవం అనంతరం నిమజ్జనానికి తరలించారు. పట్టణంలో నిమజ్జన వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నగరోత్సవం అనంతరం స్థానిక బైపాస్ రోడ్డులోని రెడ్డికుంట ప్రాంతంలో వినాయక ప్రతిమ నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, యువత పాల్గొన్నారు.



వాల్మీకిపురంలో నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం



కూరపర్తి గ్రామంలో బుల్లి గణపతి....

అంగళ్లులో ఘనంగా నిమజ్జనం



అంగళ్లులో నిమజ్జనానికి...

కురబలకోట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): అంగళ్లులో వినాయక ప్రతిమ నిమజ్జన వేడుక లను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంగళ్ళు, కురబలకోట, ముదివేడు, చేనేతనగర్ తదితర గ్రామాల్లో వినాయక ప్రతిమలను ప్రత్యేకంగా ఊరేగించారు. అంగళ్లులో భాను ప్రకాష్ ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో యువకులు సంబరాల్లో పాల్గొన్నారు. పండితుల మంత్రోచ్ఛారణ నడుమ ప్రతిమను ప్రతిష్ఠించి బాణసంచా పేల్చుతూ పుర వీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకల్లో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని, రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. అనంతరం వేడుకల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం లడ్డూ వేలం నిర్వహించారు. అనంతరం గ్రామ సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేశారు..

కలకడలో వేడుకగా...

కలకడ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రయ్యగారిపల్లిలో గణనాథుడి నిమజ్జనం గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. గణపయ్యను ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు స్వామివారికి కొబ్బరికాయలు సమర్పించి పూజలు నిర్వహించారు. బళ్లారిడ్రమ్ములు, కోలాటాలు, బాణసంచా పేలుళ్ల, అశేష జనవాహిని నడుమ కోలాహలంగా సమీపంలో నిమజ్జనం చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ, అన్నదాన వితరణ చేశారు.



ఎర్రయ్యగారిపల్లిలో....

వేడుకగా మిలాద్-ఉన్-నబీ

పీలేరు/తంబళ్లపల్లె/గుర్రంకొండ/కలకడ/పెద్దతిప్పసముద్రం/బి.కొత్తకోట/పెద్దమండ్యం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మహమ్మద్ ప్రవక్త(స.అ.సం) జన్మదిన సూచికగా మండలంలోని ముస్లింలు మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. మండలంలోని మసీదుల్లో జరిగిన సామూహిక నమాజుకు ముందు ప్రవక్త జీవిత విశేషాలను తెలియజేయడం, ఆయన ఆదేశాలను తప్పకుండా పాటించాలని మత గురువులు ధార్మిక ఉపన్యాసం చేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పట్టణంలోని పెద్దపీర్లచావిడిలో గురువారం రాత్రి ఆసార్-ఎ-షరీఫ్(ప్రవక్త పవిత్ర కేశ ప్రదర్శన) నిర్వహించారు. కేశాన్ని దర్శించుకోవడానికి పెద్దఎత్తున మహిళలు తరలి వచ్చారు. వచ్చిన వారికి ముజావర్లు ప్రసాదాలు పంపిణీ చేశారు. 10 రోజులుగా పెద్దపీర్ల చావిడిలో జరుగుతున్న ప్రవక్త జీవిత చరిత్ర పారాయణం శుక్రవారం రాత్రి ముగిసింది. కార్యక్రమాల్లో ముతవల్లీలు అల్లావుద్దీన్, సైపుల్లా బేగ్, ఇబ్రహీం, అత్తార్ చాన్‌బాషా, ముజావర్లు బుజ్జు, నౌలాక్, ఆరిఫ్, అహ్మద్, బడా బాబు, హజరత్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

● తంబళ్లపల్లె మండలంలో ప్రవక్త జన్మించిన సందర్భంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా చేసుకు న్నారు. దర్గాను రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉదయం ముస్లింలు దర్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● గుర్రంకొండ మండలంలో ముస్లింలు ప్రవక్త జన్మదినాన్ని భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. గుర్రంకొండ, తరిగొండ, చెర్లోపల్లె, మర్రిపాడు, సంగసముద్రం గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి పేదలకు స్వీట్లను పంపిణీ చేశారు. ప్రతి ముస్లిం ఇతరులకు సాయం చేసే గుణం అలవరుచుకోవాలని మతపెద్దలు బోధించారు.



ఆసార్-ఎ-షరీఫ్ నిర్వహిస్తున్న జామత్ పెద్దలు - తిలకించేందుకు బారులు తీరిన ప్రజలు

● కలకడ మండలంలో మిలాద్ ఉన్ నబీ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. కలకడ, యర్రయ్యగారిపల్లె, కోన, పాపిరెడ్డిగారిపల్లె గ్రామాల్లో మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● పెద్దతిప్పసముద్రం మండలంలో ముస్లింలు మిలాద్ ఉన్న నబీ వేడుకలను భక్తి శ్ధద్ధలతో చేసుకున్నారు. మూకుమ్మడిగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మహ్మద్ ప్రవక్తను. స్మరించుకుంటూ పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. పెద్దతిప్పసముద్రం, రంగసముద్రం, విసనకర్రవాండ్లపల్లె, మద్దయ్యగారిపల్లె, పులికల్లు, మల్లెల, కందుకూరు, చెన్నరాయునిపల్లె గ్రామాల్లో పండుగను చేసుకున్నారు.

● బి.కొత్తకోట మండలంలో మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని బారాబొఫాత్ పేరుతో ముస్లింలు ఆచరించే మిలాదున్-నబీ పర్వదినాన్ని బి.కొత్తకోటలో వేడుకగా చేసుకున్నారు. శుక్రవారం చౌక్‌మసీదు నుంచి దిగువ బస్‌స్టాండ్, బైపాస్‌రోడ్డు, రంగసముద్రం రోడ్డు మీదుగా బెంగళూరు రోడ్డులోని జామియా మసీదు వరకు ప్రవక్తను స్మరించుకుంటూ జులూస్(ర్యాలీ)నిర్వహించారు. జ్యోతిచౌక్‌లో మానవహారం నిర్మించారు. ఇమాంషావలి దర్గాలో మతగురువులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అన్నసంతర్పణ, మిఠాయిలు పంచిపెట్టారు. సీఐ గోపాల్‌రెడ్డి ర్యాలీకి బందోబస్తు నిర్వహించారు.

● పెద్దమండ్యం మండలంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు ముస్లింలు ఘనంగా చేసుకున్నారు. పెద్దమండ్యం, కలిచెర్ల, కలిచెర్ల పాతూరు, తురకపల్లి, శివపురం, సిద్దవరం తదితర గ్రామాల్లో ప్రవక్త బోధనలు వివరించారు. ధనవంతులు తమ వంతు పేదవాళ్లకు ఆకలి తీర్చాలని చెప్పినట్లు హజరత్‌లు తెలిపారు. మిలాద్ ఉన్ నబీ సందర్భగా పెద్దమండ్యం, కలిచెర్ల, తురకపల్లి ప్రత్యేక ఫాతేహా కార్యక్రమాలు ఆయా గ్రామాల్లో అన్నదానం చేపట్టారు. పెద్దమండ్యం ముత్తవల్లి బాబాబేగ్, గౌస్, సయ్యద్‌బాష, హసీంసాబ్, వుసేన్‌సాబ్, చాంద్‌బాష, జలీల్,, సాదీక్, ఆహ్మద్, సర్పంచ్ బాషా, అమీన్, రెడ్డి ఖాదర్, చాంద్‌బాషా మత పెద్దలు పాల్గొన్నారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు పోలీసు బందోబస్తు నిర్వహిచారు.



విద్యుద్దీపాలంకరణలో తంబళ్లపల్లె దర్గా

కార్పొరేషన్ డైరెక్టర్ భావనకు సన్మానం



భావనను సన్మాస్తున్న పఠాన్ ఖాదర్

మదనపల్లె, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): శాలివాహన కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పి.భావనను, హజ్‌కమిటీ రాష్ట్ర డైరెక్టర్ పఠాన్ ఖాదర్‌ఖాన్ సన్మానించారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లలో మాజీ కౌన్సిలర్ పి.భావనకు అవకాశం దక్కింది. ఈ నేపథ్యంలో ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ వన్, టూ డిపోల గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి, వాల్మీకిబోయ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ మండ్యం ప్రభాకర్, నాగరాణి, టీడీపీ నేతలు శుక్రవారం ఆమె నివాసానికి వెళ్లి అభినందించారు.

థిల్లానాతో ప్రతిభను చాటండి

పోస్టర్ ఆవిష్కరించిన శ్రీరామ్‌చినబాబు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు

మదనపల్లె, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏటా నిర్వహించే థిల్లానా సాంస్కృతిక పోటీలత్రో పతిభను చాటాలని తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరామ్‌చినబాబు పిలుపునిచ్చారు. పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ ఈనెల 13న స్థానిక చౌడేశ్వరీదేవి కళ్యాణ మండపంలో సాంస్కృతిక పోటీలు ఉంటాయన్నారు. పట్టణ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమ నిర్వాహకుడు డ్యాన్స్ మాస్టర్ వెంకటేశ్ మాట్లాడుతూ డాన్స్, పాటలు, ఫైటింగ్, మెహందీ షార్ట్ ఫిలిం విభాగాల్లో పోటీలు ఉంటాయని, విజేతలకు బహుమతులు ఉంటాయని, ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్, మెడల్ ఇస్తామని ప్రకటించారు. ఈ పోటీల్లో 10వతేదీలోగా పేర్లు 9676499064 నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నేత శ్రీకాంత్, థిల్లానా సభ్యులు దిలీప్ మిట్టా, పునీత్‌కుమార్, అంజి, మనోజ్ పాల్గొన్నారు.

నేడు మంత్రి రాక

మదనపల్లె, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మంత్రి సత్యకుమార్‌యాదవ్ శనివారం మదనపల్లెలో అభినందన సభ నిర్వహించనున్నారని నిర్వాహకులు తెలిపారు. రాజంపేట నుంచి బెంగళూరు వెళ్తూ మదనపల్లెలో పార్టీశ్రేణులతో కలవనున్నారు. మధ్యాహ్నం మంత్రికి చౌడేశ్వరీదేవి కళ్యాణ మండపం వద్ద స్వాగతం పలకనున్నారు. పార్టీ జెండా ఆవిష్కరణ అనంతరం, ర్యాలీగా శ్రీకృష్ణకళ్యాణ మండపంలో జరిగే ఆత్మీయ అభినందన సభలో మంత్రి పాల్గొంటారు. అందరూ హాజరవాలని అసెంబ్లీ కన్వీనర్ భగవాన్ అన్నారు.

పంటలకు ఈక్రాప్ తప్పని సరి

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు ఈ ఖరీఫ్‌లో వేసిన పంటలకు ఈ క్రాప్ తప్పని సరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రేమలత వెల్లడించారు. రైతులు ఆయా గ్రామ పరిధిలో రైతుసేవా కేంద్రాల్లో ఉన్న వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఆయా గ్రామ పరిధిలో పొలాలవద్ద అందుబాటులో ఉండి ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ప్రతి రైతు తప్పని సరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకుంటేనే ప్రభుత్వం అందించే వివిధ సబ్సిడీలకు అర్హులవుతారని ఆమె సూచించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులు ఏ పంటలను సాగు చేస్తారో అదే పంటలను నమోదు చేయించుకోవాలని ఆమె రైతులను కోరారు.

ఘనంగా కుంకుమాభిషేకం

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష్మీ, అన్నపూర్ణేశ్వరీ, పార్వతీదేవి అమ్మవార్లకు విశేషపూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో వేదపండితులు వేణుగోపాలశర్మ, ఎంఎస్. శేషాచలం శర్మ అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకపూజలు, నిర్వహించారు. పీటీఎం సహా సమీప గ్రామాల ప్రజలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

సీఐని సన్మానించిన టీడీపీ నేతలు

వాల్మీకిపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కొత్తగా బాధ్యతలు చేపట్టిన సీఐ రాఘవరెడ్డిని శుక్రవారం టీడీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, అన్నమయ్య జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, నాయకులు నారాయణరెడ్డి, గాంధీపేట రెడ్డిరామ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును పంపిణీ చేస్తున్న సాయిలోకేష్

కురబలకోట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ పేర్కొన్నారు. శుక్రవారం అంగళ్లులో పర్యటించిన ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం అంగళ్ళులో బాధితుడికి రూ.2.50లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు ను పంపిణీ చేశారు. పోరెడ్డివారిపల్లె వాసి రెడ్డెమ్మ పురందేశ్వరీ దృష్టికి తీసుకెళ్లి ఆయనకు సీఎంఆర్‌ఎఫ్‌ను మంజూరు చేయించారు. దీంతో ఆ చెక్కును వారి కుటుంబానికి అందజేశారు. బీజేపీ నేతలు గోపాల్‌రెడ్డి, రాజారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, చిన్నప్ప, ముగందర్, రెడ్డి బాస్కర్ పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేద్దాం

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ (బీజేపీ)ని సంస్థాగతంగా గ్రామస్థాయిలో బలోపేతం చేసేందు కు ప్రతి కార్యకర్త కలసి రావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. పెద్దకాల్వగడ్డలోని రామాలయంలో బీజేపీ మండల, గ్రామస్థాయి నేతలు, కార్యకర్తలతో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ రానున్న సంస్థాగత ఎన్నికల్లో గ్రామస్థాయిలో పట్టు బిగించాలని బీజేపీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ దృష్టి సారించి పార్టీని ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కేంద్రప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల గురించి గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరికీ వివరించాలని, ఆయా గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో ప్రధానమంత్రి ఫొటో ఉండేలా చూడాల్సిన బాధ్యత ఆయా గ్రామాల కార్యకర్తలదేనన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీకాంత్, సీనియర్ నేతలు గోల్డెన్‌వ్యాలీ రమణారెడ్డి, వెంకటనారాయణ, శివయ్య, శంకర, బాస్కర్‌రెడ్డి, రెడ్డిమోహన్ తదితరులు ఉన్నారు.